nindam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, జూన్ 10, 2026 | సంపుటి - 22 | సంచిక 252 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు

- స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం
- పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు
- 'ఎఫ్ టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



2



# ప్రతిపక్షంలో పోరాట యోధుడు..
# అధికారంలో ప్రజా పరిపాలకుడు

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**అడుగడుగునా పోరాటం.. అణగారిన వర్గాల ఆశాకిరణం..**
**తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచి**

(బిజిగిరి శ్రీనివాస్ – ఎడిటర్ నినాదం)

**తెలంగాణ రాజకీయాల్లో కొందరు నాయకులు అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కనిపిస్తారు. మరికొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మధ్యే ఉంటారు. అలాంటి అరుదైన నాయకుల్లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేరు ముందు వరుసలో నిలుస్తుంది. పదవులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి గానీ, ఆయన మాత్రం ఎప్పుడూ ప్రజల సమస్యల వెనుక నడిచారు. నేడు తెలంగాణ ఉప ముఖ్యమంత్రిగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న భట్టి విక్రమార్క ప్రస్థానం పోరాటం, పట్టుదల, ప్రజా నిబద్ధతలకు ప్రతీకగా నిలిచింది.**

### అసెంబ్లీలో గళం.. ప్రజల తరఫున పోరాటం

భట్టి విక్రమార్క అసెంబ్లీలో మాట్లాడినప్పుడు అది కేవలం ప్రతిపక్ష విమర్శ మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ ఆలోచనల ప్రతిపాదనగా ఉండేదని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. రైతుల పంటల కొనుగోలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, విద్యా వ్యవస్థ, వైద్య రంగం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆయన నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై గట్టిగా నిలబడే నాయకుడిగా ఆయనకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభించింది.

### సామాజిక న్యాయం పట్ల నిబద్ధత

భట్టి విక్రమార్క రాజకీయ తత్వంలో సామాజిక న్యాయానికి ప్రత్యేక స్థానం ఉంది. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని ఆయన తరచూ చెబుతుంటారు. అందుకే సంక్షేమ పథకాలు చివరి వ్యక్తికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తూ ఉంటారు.

### కాంగ్రెస్ కష్టకాలంలో పార్టీని భుజాన మోసిన నాయకుడు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కాంగ్రెస్ పార్టీ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొన్న కాలం ఉంది. వరుస ఎన్నికల్లో ఎదురుదెబ్బలు, నాయకుల వలసలు, కార్యకర్తల్లో నిరాశ నెలకొన్న సమయంలో పార్టీని నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమించిన నాయకుల్లో భట్టి విక్రమార్క ప్రధానుడు.

టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగా గళమెత్తిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. అసెంబ్లీలో రైతు సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగ నియామకాల ఆలస్యం, దళిత బంధు అమలు లోపాలు, భూసేకరణ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల వ్యయాల పెరుగుదల వంటి అంశాలపై నిరంతరం ప్రభుత్వాన్ని నిలదీశారు.

ప్రతిపక్ష నాయకుడిగా ఆయన మాట్లాడితే ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చేదని కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటాయి.

### మధిరలో భట్టి అంటే ఒక నమ్మకం

మధిర నియోజకవర్గం రాజకీయంగా ఎంతో క్లిష్టమైన ప్రాంతం. వివిధ రాజకీయ పార్టీల ప్రభావం ఉన్నప్పటికీ భట్టి విక్రమార్క అక్కడ ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం ఆయనకు ప్రత్యేక బలం.

నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, తాగునీటి వసతులు, సాగునీటి సదుపాయాలు, విద్యా సంస్థల అభివృద్ధి, ఆరోగ్య సేవల విస్తరణ, గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడైనా అందుబాటులో ఉండే నాయకుడిగా మధిర ప్రజలు ఆయనను భావిస్తారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, సాధారణ రోజుల్లో కూడా ప్రజల మధ్య కనిపించే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.



### పీపుల్స్ మార్చ్ - రాజకీయ యాత్ర కాదు, ప్రజల బాధల యాత్ర

భట్టి విక్రమార్క రాజకీయ జీవితంలో అత్యంత చారిత్రక ఘట్టం "పీపుల్స్ మార్చ్" పాదయాత్ర. దాదాపు 1,400 కిలోమీటర్లకు పైగా సాగిన ఈ యాత్ర తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. మండుటెండల్లోనూ, వర్షా ల్లోనూ గ్రామాలు, తండాలు, గూడేలు, రైతు పొలాలు, నిరుద్యోగ యువత ఇళ్ల వరకు వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. రైతుల అప్పులు, యువత ఉద్యోగ ఆందోళనలు, మహిళల ఇబ్బందులు, గిరిజనుల భూ సమస్యలు – ప్రతి అంశాన్ని నోట్ చేసుకుని ప్రజల గుండె చప్పుళ్లను రాజకీయ అజెండాగా మార్చారు. ఈ పాదయాత్ర కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపడమే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి బలమైన పునాది వేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు.

### ప్రతిపక్షాల దాడులను తట్టుకుని ఎదిగిన నాయకుడు

రాజకీయాల్లో భట్టి విక్రమార్క ఎన్నో విమర్శలు, ఆరోపణలు, రాజకీయ కుట్రలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఆయన తన రాజకీయ శైలిని మార్చుకోలేదు. వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై మాట్లాడడానికే ప్రాధాన్యత ఇచ్చారు.ప్రత్యర్థులు ఎంత బలంగా ఉన్నా ప్రజల మద్దతే తన బలం అని విశ్వసించిన ఆయన, ఎన్నికల పోరాటాలను సిద్ధాంతాల యుద్ధంగా చూశారు. అందుకే ప్రత్యర్థులు మారినా ఆయన రాజకీయ స్థిరత్వం మారలేదు.

### ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

పదవులు, అధికారాలు, రాజకీయ విజయాలు ప్రతి నాయకుడికి రావచ్చు. కానీ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మాత్రం అరుదు. భట్టి విక్రమార్క ఆ అరుదైన నాయకత్వానికి ప్రతీక. కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన ఒక స్ఫూర్తి. మధిర ప్రజలకు ఒక నమ్మకం. తెలంగాణ ప్రజలకు ఒక విశ్వసనీయ నాయకుడు.



### ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు

ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా భట్టి విక్రమార్క తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలకు దిశానిర్దేశం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమతుల్యం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధులు సమకూర్చే బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి, మౌలిక వసతుల విస్తరణ – ఈ ఐదు అంశాలను సమన్వయం చేస్తూ తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

**పోరాటాల నుంచి వచ్చిన నాయకత్వం, ప్రజల మధ్యే ఉండే స్వభావం, పరిపాలనలో పరిపక్వత, ఆర్థిక వ్యవస్థపై పట్టు – ఇవన్నీ కలిసి భట్టి విక్రమార్కను నేటి తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరిగా నిలబెట్టాయి.**

**"ప్రతిపక్షంలో పోరాట యోధుడు... అధికారంలో అభివృద్ధి సారథి... ప్రజల విశ్వాసానికి ప్రతిరూపం – భట్టి విక్రమార్క."**



## ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం
- పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని బిఆర్ఎస్ ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు 76వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరలకు కొంటున్న ఘనత మాదే
- జనగామ జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

2

## మహిళా సాధికారతకు మరో అడుగు

- వారి సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట



- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

2

హైదరాబాద్,జూన్ 9(నినాదం):

మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు.

## కాంగ్రెస్‌కు ఊహించని షాక్

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- అఫిడవిట్‌లో వివరాలు దాచారన్న కారణంతో తిరస్కరణ
- బిజెపి అడుగడుగనా ఓట్ చోరీకి పాల్పడుతోందన్న కాంగ్రెస్
- ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి



కాంగ్రెస్ పార్టీకి అనుకోని ఘటన ఎదురయ్యింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ వేయగా.. అది తిరస్కరణకు గురైంది.

2

## కాంగోను వణికిస్తున్న ఎబోలా

### ఇప్పటికే 101 మంది మృత్యువాత

న్యూఢిల్లీ,జూన్9(నినాదం):

మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది.

## పదేళ్ల బిఆర్ఎస్‌లో అభివృద్ధి శూన్యం

- పేదల ఆశలు నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం
- అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన పొంగులేటి



2

భద్రాద్రి కొత్తగూడెం,జూన్9(నినాదం):

గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## బాసరలో విషాద ఘటన

- గోదావరిలోకి దిగి ముగ్గురు గల్లంతు
- హైదరాబాద్‌కు చెందిన అన్నదమ్ములుగా గుర్తింపు
- గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలు వెలికితీత



నిర్మల్,జూన్9(నినాదం):

నిర్మల్ జిల్లా బాసరలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ మంగళవారం గల్లంతయ్యారు. సాయంత్రం వారి మృతదేహాలు బయట పడ్డాయి.

2

## దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికుల దుర్మరణం

హైదరాబాద్,జూన్ 9(నినాదం):

దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీ కొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే..దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు.

## ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

- మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా
- 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహిత విమర్శలు
- మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎస్‌ఎ
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



హైదరాబాద్,జూన్9(నినాదం): తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

# ముంబైలో గ్రాండ్ ఫ్రాంచైజీ లాంచ్ ఈవెంట్‌తో చారిత్రాత్మక రికార్డు సష్టించిన టేక్వాండో ప్రీమియర్ లీగ్

**ముంబై, జూన్ 9 (నినాదం):** భారతీయ క్రీడారంగంలో టేక్వాండో ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) ఒక సరికొత్త మైలురాయిని అధిగమించింది. ముంబైలోని అంధేరి వెస్ట్‌లో గల 'లఫ్ట్ ది ఎయిర్' వేదికగా ఈ లీగ్ యొక్క గ్రాండ్ ఫ్రాంచైజీ లాంచ్ ఈవెంట్ వైభవంగా జరిగింది. గ్రాడియంట్ ఇన్‌ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ సమర్పణలో, కాగ్నిటివ్ స్కోర్ ఏఐ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని టీపీఎల్ వ్యవస్థాపకుడు మరియు డైరెక్టర్ గణేష్ దువ్వూరి ఏర్పాటు చేశారు. సహ-వ్యవస్థాపకులు బి. నవనీత, జి.కె. వెంకట్ మద్దతుతో ముందుకు సాగుతున్న ఈ లీగ్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజేష్ అగర్వాల్‌ను టీపీఎల్ - ఇండియా చైర్మన్‌గా నియమించారు. భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దడానికి ఒక ప్రపంచ స్థాయి వేదికను సృష్టించడమే తమ లక్ష్యమని గ్రాడియంట్ ఇన్‌ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ చైర్మన్ విమల్ రాజ్ మాథుర్ నొక్కిచెప్పగా, అథ్లెట్లకు మెరుగైన గుర్తింపు, సాంకేతిక మద్దతు మరియు విస్తృతమైన పోటీ అవకాశాలను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గణేష్ దువ్వూరి హైలైట్ చేశారు. ఈ వేడుకకు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారిలో బీజేపీ కార్పొరేటర్ సాయలి రఘునాథ్





కుల్కర్ణి, మాజీ మిస్ ఇండియా పియా రాయ్, నటి అపూర్వ మిట్టల్, సూపర్‌మోడల్ రక్షా శెట్టి, నటుడు కరణ్ సింగ్ ఛబ్రా, మరియు దర్శకుడు పంకజ్ శ్రీవాస్తవ ఉన్నారు. కార్పొరేట్ మరియు మీడియా రంగాల నుండి యోగేష్ లఖానీ (బ్రైట్ అవుట్‌డోర్ ), పరిమల్ మెహతా (బ్లాంకెన్‌వాస్ మీడియా), వెల్‌నెస్ కన్సల్టెంట్ సంతోష్ కె. పాండే, మరియు డెంటిస్ట్ నిదా ఖతీబ్ వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ లీగ్‌లో పాల్గొనబోయే ఎనిమిది ఫ్రాంచైజీల లోగోలను, వాటి యజమానుల వివరాలను అధికారికంగా ఆవిష్కరించడం ఈ ఈవెంట్‌లోనే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ ఫ్రాంచైజీలలో సందీప్ బి. జైన్ ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ రైజర్స్, రాహుల్ నేతృత్వంలోని మహారాష్ట్ర అవెంజర్స్, శ్యామ్ భాయ్ కి చెందిన ఢిల్లీ వారియర్స్, దేవిక బోరా మరియు నిర్మల్ జైన్ ల నార్త్ ఈస్ట్ హీరోస్, క్రికెటర్లు ఇర్ఫాన్ పఠాన్ మరియు యూసుఫ్ పఠాన్ ల మద్దతుతో హర్మీత్ నడుపుతున్న బెంగాల్ టైగర్స్, విజయ్ కుమార్ బి. మరియు విజయ్ భన్సాలీ ల గుజరాత్ థండర్, అలాగే వంశీ మరియు శ్రీ ల రాజస్థాన్ రెబెల్స్ ఉన్నాయి. ఈ గ్రాండ్ లాంచ్ విజయవంతం కావడంతో, టీపీఎల్ ఇప్పుడు జాతీయ స్థాయి విస్తరణ మరియు అంతర్జాతీయ పోటీల నిర్వహణ దిశగా అడుగులు వేస్తోంది.

## మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, జూన్ 9 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ రాజుల స్వామి నగర్, సిద్ధార్థ్ నగర్, జై శ్రీరామ్ నగర్, మరాఠీ బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా రాజుల స్వామి నగర్లో భూగర్భ డ్రైనేజీ అవుట్ లెట్ సమస్య, సిద్ధార్థ నగర్ లో భూగర్భ డ్రైనేజీ సమస్యతో పాటు శానిటేషన్ సమస్య, వరద నీటి సమస్య, జై శ్రీరామ్ నగర్ లో సీసీ రోడ్డు సమస్యతో పాటు నాలా సమస్యను ఎమ్మెల్యే పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ పనులలో అధికారుల నిర్లక్ష్య వైఖరి పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ ను ఎంతో అభివృద్ధి పరిచామని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని రానున్న రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్ నగర్ డివిజన్ తో పాటు అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఈఈ సుబ్రహ్మణ్యం, డీజీఎం శ్రావణి, వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, వారాల వినోద్, రాజ్ కుమార్ ముదిరాజ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, రవి, వేణు, మరాటి అశోక్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, స్వామి, చందు,గట్టు అశోక్, కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**వికారాబాద్, జూన్ 9(నినాదం):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పరిగి మండలం జాఫర్‌పల్లి ఎకో అర్బన్ పార్కులో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మార్గదర్శకత్వంలో వికారాబాద్ జిల్లాలో ఆరు లక్షల మొక్కలను పెంచే లక్ష్యంతో అటవీశాఖ అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. జాఫర్‌పల్లిలో సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంతో ఎకో అర్బన్ పార్కును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే ఈ పార్కుకు శంకుస్థాపన జరిగిందని, దశలవారీగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. హెచ్ఎండిఏ ద్వారా మరిన్ని నిధులు తీసుకువచ్చి పార్కును రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన అర్బన్ పార్కుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పరిగి పట్టణంలోని తిరుమల హిల్స్ నంబర్ ఒకటి స్కూల్ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామని, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. జాఫర్‌పల్లిలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడం జరిగిందని, పరిగి మున్సిపాలిటీ పరిధిలోని తుంకులగడ్డలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు సరికొత్త బాట!

- శంషాబాద్‌లో ఆర్టీసీ అద్దె బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- రాష్ట్రవ్యాప్తంగా 400 మహిళా సంఘాల బస్సులు ప్రారంభం
- మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చడమే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం



**రాజేంద్రనగర్, జూన్ 9 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపేందుకు ప్రత్యేక రుణ సదుపాయం కల్పించి, వాటిని టీజీఆర్టీసీ పరిధిలో నడిపించేలా ప్రభుత్వం ఈ వినూత్న పథకానికి రూపకల్పన చేసింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన కేటాయించిన 400 సరికొత్త బస్సులను ప్రభుత్వం ఘనంగా ప్రారంభించింది. శంషాబాద్‌లో ఉత్సాహంగా అద్య బస్సుల ప్రారంభోత్సవం : రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్థానిక మహిళా సంఘానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సును రిబ్బన్ కట్ చేసి, పచ్చజెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. "మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, వ్యాపారవేత్తలుగా, రవాణా రంగంలోనూ భాగస్వాములు కావాలనేదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి, బస్సుల కొనుగోలుకు మద్దతు ఇవ్వడం ద్వారా వారికి శాశ్వత ఉపాధి లభిస్తుందని అన్నారు. మహిళా సాధికారతకు ఈ పథకం దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని కొనియాడారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు నడపడం వల్ల అటు ఆర్టీసీలో బస్సుల కొరత తీరడంతో పాటు, ఇటు మహిళలకు నిరంతర ఆదాయం లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్ని స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఉద్యమకారులు అందరికీ న్యాయం చేస్తాం

- తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి



**ఎల్బీనగర్, జూన్ 9(నినాదం):** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి అన్నారు. చైతన్యపురిలోని శివాజీ విగ్రహం దగ్గర తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమం వికలాంగుల పాత్ర ఆత్మగౌరవం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 సంవత్సరం నుండి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు న్యాయం చేయాలని కాచం సత్యనారాయణ పోరాటం చేస్తున్నారని అన్నారు. అన్ని జిల్లాలు తిరిగి కమిటీలు వేశారని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి ఉద్యమకారులందరిని మర్చిపోయాడని, కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర పదవులు ఇచ్చాడని అన్నారు. కాచం సత్యనారాయణ కూడా ఎమ్మెల్యే పదవి వరించాల్సి ఉందని, కానీ అది వేరే వాళ్లకు ఇచ్చాడని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని అన్నారు. ఉద్యమకారులందరిని చిన్నచూపు చూసి కుటుంబ పాలనే కొనసాగించాడని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే ఇప్పుడు ఉద్యమకారులు పోరాటం చేయవలసిన అవసరం ఉండేది కాదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వికలాంగుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. తార్నాకలో కూడా మొదటి జెండా పట్టింది మేమే అని, మా కుటుంబంలో కూడా అమరుడు అయ్యాడని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారులు అందరికీ కూడా ఈ ప్రభుత్వం లో న్యాయం జరుగుతుందని అన్నారు. గత వారం లో సెక్రటేరియట్ లో అన్ని పార్టీలతో కలిసి అఖిలపక్షం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎల్బీనగర్ కీలక పాత్ర పోషించిందని జైలుకుపోయిన వారు అమరులైన వారు ఎంతో మంది ఉన్నారని అన్నారు. అన్ని జేఏసీ ఏకమై సకలజనుల సమ్మెలో పాల్గొని తెలంగాణ సాధించామని అన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ నాటినుండి నేటి వరకు తెలంగాణ ఉద్యమం లో ఎల్బీనగర్ నియోజకవర్గం కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం సభ్యులు రంగారెడ్డి , పల్లె వినయ్ కుమార్, కూర రమేష్ , కొత్త రవి, శ్రవణ్ కుమార్ గుప్తా, పురేందర్ నేత, నర్సిరెడ్డి , వెంకట్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, వికలాంగుల సంఘం నాయకులు ఆంజనేయులు, నాగభూషణం, రాంబాబా, వేణు , సుధాకర్, రాజ్యలక్ష్మి, వెంకటేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

## గోదాములు, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**పెబ్బేరు, జూన్ 9 (నినాదం):** గోదాములు, రైస్ మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా వేగంగా అన్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. పెబ్బేరు పరిధిలోని రాధాకృష్ణ ఇండస్ట్రీస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లుల గోదాముల వద్ద కొనసాగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. లారీలలో ఉన్న ధాన్యానికి వర్షం తగలకుండా తప్పనిసరిగా టార్పాలిన్లు కప్పి ఉంచాలని సూచించారు. మిల్లుల వద్ద లారీలు ఎక్కువ సమయం నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన మేరకు హమాలీల (కార్మికుల) సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు సూచించారు. మిల్లుకు చేరిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించారు. ఎక్కడా లారీలు నిలిచిపోయే పరిస్థితి తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా, ధాన్యం నిల్వ కోసం అవసరమైన గోదాములను ముందస్తుగా సిద్ధం చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారికి సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం తరలింపు, అన్‌లోడింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి కృషితోనే నిధులు విడుదల

- కాంగ్రెస్ మల్కాజిగిరి నియోజకవర్గ ఇంచార్జి తోట లక్ష్మి కాంత్ రెడ్డి

**మల్కాజిగిరి, జూన్ 9( నినాదం):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కృషి తోనే కారిడార్ ఫ్లై ఓవర్ కి 960 కోట్లు సాంక్షన్ అయిందని కాంగ్రెస్ మల్కాజిగిరి ఇంచార్జి తోట లక్ష్మీకంత్ రెడ్డి అన్నారు. మంగళవారం గౌతమ్ నగర్ డివిజన్ ఉత్తమ్ నగర్ చౌరస్తా లో కాంగ్రెస్ మల్కాజిగిరి నియోజకవర్గ ఇంచార్జి తోట లక్ష్మీ కాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలు ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న సికింద్రాబాద్, మారేడుపల్లి వైపు వెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మల్కాజిగిరి నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లడానికి సుమారు 20 నుంచి 30 కాలనీల ప్రజలు ఎటీసీ రహదారిని వాడుతున్నారు. రోడ్డు రక్షణ శాఖ వారి ఆధీనంలో ఉండటంతో వాహనదారులు నిర్దేశింపబడిన సమయాల్లోనే ఉపయోగించాల్సి వస్తుందని, రద్దీవేళలో ఈ సమస్య అధికంగా ఉంటుందన్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గతంలోనే ఈ సమస్యని రాష్ట్ర ప్రభుత్వం వద్ద చర్చించి, పరిష్కరించడానికి ప్రయత్నించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ సమస్యని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి, రాష్ట్ర ప్రభుత్వం, జిహెచ్ఎంసీ అధికారులని రంగంలో దించి, రక్షణ శాఖ అధికారుల సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం 960 కోట్లు కేటాయించింది. ఈ రోడ్డు ఉత్తమ్ నగర్ నుంచి వెస్ట్ మారేడ్ పల్లి వరకు నిర్మిస్తారని, దీనివల్ల మల్కాజిగిరి ప్రజలకు చక్కని రోడ్డు మార్గం ఏర్పడి సమయం చాలా ఆదా అవుతుందని, దీనికి కృతజ్ఞతగా మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మల్కాజిగిరి



బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, గుండా నిరంజన్, జి ఎన్ వి సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ఎస్ ఆర్ ప్రసాద్ రాందాస్ సంతోష్ ముదిరాజ్, రామచందర్, డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, పిట్టల నాగరాజు, జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్, లక్ష్మి, కన్నె మల్ల నాగరాజు, సురేష్ సింగ్, వెంకన్న, సిరిగిరి రాజు, పుష్పలత, ఫరీద్, సయ్యద్ మబ్బు, బ్రహ్మయ్య, రామక్రిష్ణ, పరమేష్, పార్థ సారథి,అశోక్ రెడ్డి, పాండు రంగ చారి, తదితరులు పాల్గొన్నారు.

**కెనరా బ్యాంక్** భారత ప్రభుత్వ రంగ సంస్థ | Syndicate

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, హైదరాబాద్ (డిపి కోడ్: 2752), ఎంసిహెచ్ నెం. 10-3-163 & 10-3-163/ఎ, గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ ఆఫీస్ భవనం, రైల్ నిలయం పక్కన, సికింద్రాబాద్ - 500 026
ఫోన్: 040-27725260, 27725259, ఇ-మెయిల్: cb2752@canarabank.com

### అమ్మకపు ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) & 9 కు నిబంధనలతో చదవబడుతూ స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

**వేలం తేది & సమయం : 30.06.2026 న ఉ. 11.30 గం॥ల నుండి మ. 12.30 గం॥ల వరకు**
(అమ్మకం ముగిసేంత వరకు ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడగింపుతో)
బయానా డిపాజిట్ చేయుటకు ఆఖరి తేది : 29.06.2026 న సా. 05.00 గం॥ల లోగా.
ఆస్తి తనిఖీ చేయు తేది : 24.06.2026 న ఉ.10.00 గం.లు మరియు సా.5.00 గం.ల మధ్య

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు రుణగ్రహీత(ల)కు మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు **కెనరా బ్యాంక్, నారాయణగూడ** బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనములోకి తీసుకోబడినవి మరియు దిగువ ఫాలోఅప్ కోసం ఏఆర్ఎం హైదరాబాద్ బ్రాంచ్ కు ప్రస్తుతం ఖాతా బదిలీ చేయబడినది. ఇవి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయిలు **30.05.2026** నాటికి **రూ.2,97,93,595.48 (రూపాయలు రెండు కోట్ల తొంబై ఏడు లక్షల తొంబై మూడు వేల ఐదు వందల తొంబై ఐదు మరియు పైసలు నలభై ఎనిమిది మాత్రమే)** (వసూలు తేదీ వరకు వర్తించని వడ్డీ మరియు తదుపరి వర్తించే విధంగా బ్యాంకు ఛార్జీలు) **రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీత(లు) / కో-ఆబ్లిగెంట్(లు) / హామీదారు(లు) / తనఖాదారు(లు) : (1) మెస్సర్స్ సనా ఆడియో విజువల్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్,** డి.నెం. 2-6-7-జెసి/544, జన చైతన్య కాలనీ, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500030, **(2) శ్రీ మొహమ్మద్ షానవాజ్ తండ్రి షేక్ ముంతాజ్ సుతాహత్,** బాప్టిస్ట్ చర్చి వెనుక, సుతానత్, కటక్ సదర్, కటక్, ఒడిశా-753001. **(3) శ్రీ మొహమ్మద్ షానవాజ్,** డి.నెం. 2-6-7-జెసి/544, జన చైతన్య కాలనీ, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500030. **(4) శ్రీమతి బొజై మొమినా తండ్రి ఆసఫ్ అలీ ఖాన్,** నివాసం. 8-2-585/సి, ఎఫ్ నెం.501, ఖాదర్ రెసిడెన్స్, రోడ్ నెం. 10, బంజారా హిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034. **(5) శ్రీమతి బొజై మొమినా భర్త కమ్మర్ అహ్మద్,** నివాసం. ఫ్లాట్ నెం 2-6-7/జెసి/544, జనచైతన్య కాలనీ, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా-500030. **(6) ఎంఎస్ షాజియా పర్వీన్ భర్త మొహ్సిన్ ఖాన్,** బంగ్లా నెం.08, మినిస్టర్స్ క్వార్టర్స్, కుందన్‌బాగ్, హైదరాబాద్, తెలంగాణ-500016. **(7) ఎంఎస్ షాజియా పర్వీన్ భర్త మొహ్సిన్ ఖాన్,** ఫ్లాట్ నెం 104, 1వ అంతస్తు, హార్మోనీ ప్రెస్టీజ్ అపార్ట్‌మెంట్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్-500057 వారి నుండి బకాయిలు రాబట్టుకొనేందుకు **"ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా", మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికపై **30.06.2026** న విక్రయించబడును.

**రిజర్వ్ ధర రూ.1,21,00,000/- (రూపాయలు ఒక కోటి ఇరవై ఒక్క లక్షలు మాత్రమే) మరియు బయానా రూ. 12,10,000/- (రూపాయలు పన్నెండు లక్షల పది వేలు మాత్రమే). బిడ్డు గుణాంకాలు: రూ. 1,00,000/-**

**ఆస్తి వివరములు మరియు పూర్తి వివరణ :**

తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, మాసబ్ ట్యాంక్ వద్దగల ఫ్లాట్ నెం.1 (పాత ఆవరణ భాగం నెం.10-3-314) యొక్క పోర్షన్‌పై మున్సిపల్ భాగం నెం.10-3-316/2 గల ఆస్తి మరియు కొత్త మున్సిపల్ నెం.10-3-314 కలిగిన ఆవరణలో 12404 చ.గ.ల మొత్తంలో 65 చ.గ.ల విస్తీర్ణం గల అవిభాజ్యవాటాతో పాటు 200 చ.అ.ల విస్తీర్ణంతో రెండు కారు పార్కింగ్ స్థలములతో సహా 2142 చ.అ.ల (కామన్ ఏరియాలతో సహా) బిల్టప్ ఏరియా ఫ్లాట్, సెల్లార్ + స్టిల్ట్ + 5 అంతస్తులకు చెందిన "హార్మనీ ప్రెస్టీజ్" అపార్ట్‌మెంట్‌లోని మొదటి అంతస్తులో నివాసపు ఫ్లాట్ నెం.104 (అనగా ఫ్లాట్ నెం.104-ఏ & 104-బి) యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** లిఫ్ట్ & ఖాళీ ప్రదేశం, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** కారిడార్, **పడమర:** ఖాళీ ప్రదేశం, **ఎస్ఆర్ఓ గోల్కొండ వద్ద సేల్ డీడ్ నెం.3759/2010, తేది: 07/10/2010. తనఖా డీడ్ నెం.2069/2019, తేది: 26/03/2019 ఎస్ఆర్ఓ గోల్కొండ వద్ద కలదు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఐడి : 400032159113.**

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు రుణగ్రహీత(ల)కు మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు **కెనరా బ్యాంక్, హనుమకొండ** బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనములోకి తీసుకోబడినవి మరియు దిగువ ఫాలోఅప్ కోసం ఏఆర్ఎం హైదరాబాద్ బ్రాంచ్ కు ప్రస్తుతం ఖాతా బదిలీ చేయబడినది. ఇవి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయిలు **30.05.2026** నాటికి **రూ. 2,55,81,466.90 (రూపాయలు రెండు కోట్ల యాభై ఐదు లక్షల ఎనభై ఒక్క వేల నాలుగు వందల అరవై ఆరు మరియు పైసలు తొంబై మాత్రమే)** (వసూలు తేదీ వరకు వర్తించని వడ్డీ మరియు తదుపరి వర్తించే విధంగా బ్యాంకు ఛార్జీలు) **రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీత(లు) / కో-ఆబ్లిగెంట్(లు) / హామీదారు(లు) / తనఖాదారు(లు) : (1) మెస్సర్స్ వాగ్దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ,** ఇం.నెం.5-11-486/1, రోడ్ నెం. 3, శ్రీ నగర్ కాలనీ, హన్మకొండ, తెలంగాణ -506001. **(2) శ్రీ గోపు అమరేందర్ రెడ్డి తండ్రి జి శివా రెడ్డి,** ఇం.నెం. 5-11-486-1, శ్రీనగర్ కాలనీ, వీధి 3, నైమానగర్, వరంగల్, తెలంగాణ-506001. **(3) శ్రీ వైద్యుల సురేందర్ రెడ్డి తండ్రి ఎ రాజి రెడ్డి,** ఇం.నెం.5-11-486-1, శ్రీనగర్ కాలనీ రోడ్, నైమానగర్, హన్మకొండ, తెలంగాణ-506001. **(4) ఎంఎస్ వైద్యుల సరస్వతి,** ఇం.నె.5-11-486/1, శ్రీనగర్ కాలనీ, నైమ్‌నగర్ కాలనీ, హన్మకొండ, తెలంగాణ-506001. **(5) శ్రీ మామిదాల ఆనందం తండ్రి రాజవీరు,** ఇం.నెం.16-4-73, గోదావరిఖని, రామగుండం, కరీంనగర్, తెలంగాణ-505208. **(6) శ్రీ వి రాజి రెడ్డి,** చిన్నపాపయ్య పల్లి, హుజూరాబాద్, కరీంనగర్, తెలంగాణ-505101. **(7) ఎంఎస్ గోపు శోభ భర్త డి లింగయ్య,** ఇం.నెం.5-11-486/1, శ్రీనగర్ కాలనీ, నైమ్‌నగర్, హన్మకొండ, తెలంగాణ-506001. **(8) శ్రీ దాసరి తిరుమల్ రెడ్డి తండ్రి డి. లింగా రెడ్డి,** ఇం.నెం.1-95, చింతపల్లి, శంకరపట్నం, మొలంగూర్, కరీంనగర్, తెలంగాణ-505470. **(9) శ్రీ గోపు అమరేందర్ రెడ్డి,** సర్వే నం. 766 మరియు 766/2గా విభజించబడింది, ఇం.నెం. 15-2-34ఎఫ్ సమీపంలో, లెక్చరర్స్ అసోసియేషన్ కాలనీ, హనుమకొండ, తెలంగాణ-506001. **(10) శ్రీ వైద్యుల సురేందర్ రెడ్డి,** సర్వే నం. 766 మరియు 766/2 గా విభజించబడింది, ఇం.నెం. 15-2-34ఎఫ్ సమీపంలో, లెక్చరర్స్ అసోసియేషన్ కాలనీ, హనుమకొండ, తెలంగాణ-506001 వారి నుండి బకాయిలు రాబట్టుకొనేందుకు **"ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా", మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికపై **30.06.2026** న విక్రయించబడును.

**రిజర్వ్ ధర రూ.1,85,73,000/-(రూపాయలు ఒక కోటి ఎనభై ఐదు లక్షల డెబ్బై మూడు వేలు మాత్రమే), మరియు బయానా : రూ. 18,57,300/- (రూపాయలు పద్దెనిమిది లక్షల యాభై ఏడు వేల మూడు వందలు మాత్రమే), బిడ్డు గుణాంకాలు: రూ. 1,00,000/-.**

**ఆస్తి వివరములు మరియు పూర్తి వివరణ :**

హన్మకొండ జిల్లా, హన్మకొండ రెవెన్యూ గ్రామం మరియు మండలం, లెక్చరర్స్ అసోసియేషన్ కాలనీ వద్దగల 917.58 చ.గ.ల నెట్ ఏరియాతో రోడ్లు మరియు ఇతర యొక్క భాగంగా తగ్గించబడిన 494.08 చ.గ.లలో 1411.66 చ.గ.ల విస్తీర్ణంతో ఇం.నెం.15-2-34ఎఫ్ సమీపాన సర్వే నెం.766/2గా విభజింపబడినది మరియు సర్వే నెం.766, ఓపెన్ ప్లాట్‌కు చెందిన ఆస్తి యావత్తు. శ్రీ జి అమరేందర్ రెడ్డి & వి సురేందర్ రెడ్డి పేరున కలదు. **సరిహద్దులు: ఉత్తరం :** సిహెచ్. మధుకర్ రెడ్డి ప్లాట్ మరియు ఇతరులు (దేవరకొండ యుగేందర్ యొక్క సర్వే నెం. 766/2 (పార్ట్-బి)లో గతంలో భూమి), **దక్షిణం :** సిహెచ్ మధూకర్ రెడ్డి మరియు ఇతరులు (బత్తుల రాజేందర్‌కు విక్రయదారు అమ్మిన గతంలోని భూమి), **తూర్పు :** 20'-0" వెడల్పు రోడ్డు, **పడమర :** దేవరకొండ ప్రభాకర్ యొక్క సర్వే నెం. 766/2 (పార్ట్-సి)లోని భూమి, వరంగల్ రిజిస్ట్రార్ వద్ద రిలీజ్ డీడ్ నెం.8977/2013, తేదీ 04/10/2023. **వరంగల్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 1 వద్ద తనఖా డీడ్ నెం. 2439/2017, తేది: 19/04/2017. సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఐడి: 400016457954.**

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు రుణగ్రహీత(ల)కు మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు **కెనరా బ్యాంక్, ప్యాట్నీ** బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనములోకి తీసుకోబడినవి మరియు దిగువ ఫాలోఅప్ కోసం ఏఆర్ఎం హైదరాబాద్ బ్రాంచ్ కు ప్రస్తుతం ఖాతా బదిలీ చేయబడినది. ఇవి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయిలు **30.05.2026** నాటికి **రూ. 2,54,64,700.08 (రూపాయలు రెండు కోట్ల యాభై నాలుగు లక్షల అరవై నాలుగు వేల ఏడు వందలు మరియు పైసలు ఎనిమిది మాత్రమే)** (వసూలు తేదీ వరకు వర్తించని వడ్డీ మరియు తదుపరి వర్తించే విధంగా బ్యాంకు ఛార్జీలు) **రుణగ్రహీత(లు) / కో-ఆబ్లిగెంట్(లు) / హామీదారు(లు) : (1) మెస్సర్స్ విజయ రామ అగ్రో ట్రేడర్స్,** ఇం.నెం.2-1-119/79/2, 1వ అంతస్తు, జెబిఎం ఆర్కేడ్, మమతానగర్, రోడ్ నెం 2, నాగోల్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, హైదరాబాద్-500068. **(2) శ్రీ చీదర వీరన్న తండ్రి చీదర వెంకటేశ్వర్లు,** ఇం.నెం. 11-13-75/1ఎ/1, ఫ్లాట్ నెం. 402, పివిఆర్ అప్సర ఆర్కేడ్, రోడ్ నెం. 2, హరిపురి కాలనీ, అల్కాపురి, నాగోల్, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500035. **(3) శ్రీ చొక్కారపు విష్ణు కుమార్ తండ్రి లేట్ చొక్కారపు గౌరీ శంకర్,** ఇం.నెం.7-1-396/2/10/10, వార్డ్ నెం.07, బ్లాక్ నం.1, వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా, ఎంబిజిహెచ్, బికె గూడ, ఎస్ఆర్ నగర్, హైదరాబాద్-500038 వారి నుండి బకాయిలు రాబట్టుకొనేందుకు **"ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా", మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికపై **30.06.2026** న విక్రయించబడును.

**రిజర్వ్ ధర రూ.1,92,00,000/- (రూపాయలు ఒక కోటి తొంబై రెండు లక్షలు మాత్రమే) మరియు బయానా రూ.19,20,000/- (రూపాయలు పంతొమ్మిది లక్షల ఇరవై వేలు మాత్రమే), బిడ్డు గుణాంకాలు: రూ.1,00,000/-**

**ఆస్తి వివరములు మరియు పూర్తి వివరణ :**

తెలంగాణ, హైదరాబాద్, బికె గూడ వద్దగల మున్సిపల్ నెం.7-1-396/2/10/10 మరియు ఇం.నెం.12/ఎ గల ఆస్తిలో 266.97 చ.గ.లలో 133.48 చ.గ.ల విస్తీర్ణం గల భూమి యొక్క అవిభాజ్యవాటాతో పాటు కామన్ ఏరియాలు మరియు మెట్లతో పాటు 1971 చ.అ.ల విస్తీర్ణంతో మొత్తం 3వ అంతస్తు యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం :** మెట్ల మార్గం మరియు లాబీ, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** ఖాళీ ప్రదేశం, **పడమర:** ఖాళీ ప్రదేశం. **పార్టిషన్ డీడ్: 2456/2013, తేది 27/11/2015, జాయింట్ సబ్-రిజిస్ట్రార్, ఎస్.ఆర్. నగర్, హైదరాబాద్ వారి వద్ద, తనఖా డీడ్ నెం: 271/2023, తేది: 28/01/2023, సబ్-రిజిస్ట్రార్, ఎస్.ఆర్. నగర్, హైదరాబాద్ వారి వద్ద, CERSAI Id: 400069447960.**

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు రుణగ్రహీత(ల)కు మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు **కెనరా బ్యాంక్, బషీర్‌బాగ్** బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనములోకి తీసుకోబడినవి మరియు దిగువ ఫాలోఅప్ కోసం ఏఆర్ఎం హైదరాబాద్ బ్రాంచ్ కు ప్రస్తుతం ఖాతా బదిలీ చేయబడినది. ఇవి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయిలు **30.05.2026** నాటికి **రూ. 3,55,02,957.21 (రూపాయలు మూడు కోట్ల యాభై ఐదు లక్షల రెండు వేల తొమ్మిది వందల యాభై ఏడు మరియు పైసలు ఇరవై ఒక్కటి మాత్రమే)** (వసూలు తేదీ వరకు వర్తించని వడ్డీ మరియు తదుపరి వర్తించే విధంగా బ్యాంకు ఛార్జీలు) **రుణగ్రహీత(లు) / కో-ఆబ్లిగెంట్(లు) / హామీదారు(లు) : (1) మెస్సర్స్ విస్టాన్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్,** రిజిస్టర్డ్ ఆఫీస్: నెం.8-3-483, 486-502, ఫ్లాట్ నెం.402, సన్‌సిటీ అపార్ట్‌మెంట్స్, ఎల్లారెడ్డిగూడ, అమీర్‌పేట్, హైదరాబాద్-500016. **(2) మెస్సర్స్ విస్టాన్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్,** అడ్మిన్ ఆఫీస్ : బ్లాక్ బి, రెండవ అంతస్తు, ఈషాన్ ఆర్కేడ్, ఫ్లాట్ నెం.3-164, సర్వే నెం.48, కావూరి హిల్స్, మాదాపూర్-హైదరాబాద్-500081. **(3) మెస్సర్స్ విస్టాన్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్యాక్టరీ ఆఫీస్: ఇం.నెం.26-829, పంచశీల కాలనీ, ఐడిఏ గాంధీనగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500039. **(4) శ్రీ రామరాజు సింగం తండ్రి లేట్ శ్రీ హరి సింగం,** రిజిస్టర్డ్ ఆఫీస్: ఇం.నెం.8-3-483, 486-502, ఫ్లాట్ నం.402, సన్‌సిటీ అపార్ట్‌మెంట్స్, ఎల్లారెడ్డిగూడ, అమీర్‌పేట్, హైదరాబాద్-500016. **(5) శ్రీమతి జయ లక్ష్మి సింగం భర్త సింగం శ్రీహరి,** ఇం.నెం: నెం.8-3-483,486-502, ఫ్లాట్ నెం 402, సన్‌సిటీ అపార్ట్‌మెంట్స్, ఎల్లారెడ్డిగూడ, అమీర్‌పేట్, హైదరాబాద్-500016. **(6) శ్రీమతి సాయి మంజుల బసిబోయిన భర్త రామరాజు సింగం,** ఇం.నెం. 8-3-483, 486-502, ఫ్లాట్ నెం. 402, సన్‌సిటీ అపార్ట్‌మెంట్స్, ఎల్లారెడ్డిగూడ, అమీర్‌పేట్, హైదరాబాద్-500016 వారి నుండి బకాయిలు రాబట్టుకొనేందుకు **"ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా", మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికపై **30.06.2026** న విక్రయించబడును.

**రిజర్వ్ ధర రూ. 73,35,000/- (రూపాయలు డెబ్బై మూడు లక్షల ముప్పై ఐదు వేలు మాత్రమే) మరియు బయానా రూ. 7,33,500/- (రూపాయలు ఏడు లక్షల ముప్పై మూడు వేల ఐదు వందలు మాత్రమే), బిడ్డు గుణాంకాలు: రూ. 1,00,000/-**

**ఆస్తి వివరములు మరియు పూర్తి వివరణ :**

తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, ఎల్లారెడ్డిగూడ వద్దగల సర్వే నెం.లు 139 & 140 (పాత నెం.48) లలో నెం.8-3-483 & 486 నుండి 502 గల ఆవరణలలో 4955.52 చ.గ.లు లేదా 4142.81 చ.మీ.ల విస్తీర్ణంతో భూమి యొక్క మొత్తం విస్తీర్ణంలో 45 చ.గ.లలో భూమి యొక్క అవిభాజ్య వాటాతో పాటు 1570 చ.అ.ల (కామన్ ఏరియాతో సహా) విస్తీర్ణంతో "సన్ సిటీ"లోని బ్లాక్-ఎ లో 3వ అంతస్తుపై ఫ్లాట్ నెం.402 యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** కారిడార్, లిఫ్ట్ & మెట్ల మార్గం, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** కారిడార్ & ఫ్లాట్ నెం 401, **పడమర:** ఖాళీ ప్రదేశం & ఫ్లాట్ నెం 403. **తనఖా డీడ్ నెం.5899/2021, తేది: 16/09/2021, ఎస్.ఆర్.ఓ. బంజారా హిల్స్, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఐడి: 400052407205.**

*బ్యాంకుకు తెలిసినంతవరకు ఎటువంటి రుణభారములు లేవు. అయినప్పటికీ కాగోరు బిడ్డర్లు బిడ్డు దాఖలుకు ముందు ఆస్తులను ప్రభావితం చేసే రుణభారములు, ఆస్తుల యొక్క టైటిల్, క్లెయిమ్‌లు/ హక్కులు/ బకాయిలకు సంబంధించి తమకుతామే స్వతంత్ర విచారణలు చేయవలసి ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయగలరు, ఇ-మెయిల్ ఐడి: cb2752@canarabank.com లేదా చీఫ్ మేనేజర్; ఏఆర్ఎం బ్రాంచ్, హైదరాబాద్ వారిని ఏదేని పనిరోజున కార్యాలయ వేళలో ఫోన్ నెం.: 040-27725259/ 27725260/ 83/ 85 లపై సంప్రదించగలరు.
వేలం విధానం: ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్.
వేలం సర్వీస్ ప్రొవైడర్ వివరములు: M/s. PSB Alliance Pvt.Ltd (baanknet) Contact Numbers "8291220220, E-mail:support.baanknet@psballiance.com, Website:https://baanknet.com

తేది : 03.06.2026, ప్రదేశం : హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

**కెనరా బ్యాంక్** భారత ప్రభుత్వ రంగ సంస్థ

ఏఆర్ఎం బ్రాంచ్ హైదరాబాద్ (డిపి కోడ్: 2752)
ఎంసిహెచ్ నెం. 10-3-163 & 10-3-163/ఎ, గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ ఆఫీస్ బిల్డింగ్, రైల్ నిలయం ప్రక్కన, సికింద్రాబాద్-500026
ఫోన్: 040-27725260, 27725259, ఇ-మెయిల్: cb2752@canarabank.com

### ఇ-వేలం అమ్మకం రద్దు ప్రకటన

**రుణగ్రహీత పేరు** కోసం దయచేసి మా వేలం అమ్మకపు నోటీసును చూడండి: **(1) మెస్సర్స్ సెమెట్రిక్స్ ఐటి సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్,** 6బి, సర్వే నెం. 80-84, ఆరవ అంతస్తు, మిలాంజ్ టవర్స్, పత్రికా నగర్, మాదాపూర్, హైటెక్ సిటీ, హైదరాబాద్-500081. **(2) శ్రీ రాజేష్ గుప్త కొత్త (డైరెక్టర్),** తండ్రి శ్రీనివాస్లు కొత్త, ఫ్లాట్ నెం. 303, వైఎస్ఆర్ ఎన్‌క్లేవ్, ఫ్లాట్ నెం. ఇ5, మణికొండ, హైదరాబాద్-500089. **(3) శ్రీమతి శిల్పా బందా (డైరెక్టర్),** తండ్రి బి.పి. రంగారావు, ఇంటి నెం. 1-2/606/80/77, ఎల్ఐసి కాలనీ, ఇందిరా పార్క్ ఎదురుగా, దోమల్‌గూడ, హైదరాబాద్-500029. **వేలం తేది & సమయం: 12-06-2026**న ఉదయం 11:30 గం॥ల నుండి మధ్యాహ్నం 12:30 గం॥ల వరకు. **10-05-2026**న నినాదం మరియు ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ - హైదరాబాద్ ఎడిషన్ వార్తాపత్రికలలో ప్రచురించబడిన **అమ్మకపు నోటీసు ఉపసంహరించబడింది మరియు వేలం రద్దు చేయబడింది.**

తేది: 09-06-2026 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ — కెనరా బ్యాంక్, ఏఆర్ఎం

## ఈవిఎం, వివి ప్యాట్ గోదాం తనిఖీ చేసిన కలెక్టర్



**భూపాలపల్లి, జూన్ 9 (నినాదం):** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి ప్యాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**BRANCH SHIFTING**

మా విలువైన కస్టమర్ల కోసం, మా **NIZAMABAD - VINAYAKA NAGAR** బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి **10.09.2026** నుండి మార్చబడు తుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

**Muthoot Finance Ltd**
EGround Floor, H.No: 1-12-123/5/1,
Srinagar Colony, Opp: Prashanthi Homes,
Vinayakanagar, Nizamabad,
Nizamabad District, Telangana State,
Pin – 503002.
Ph: 08462-297722 / 8129486735.
Email: mgniz4774@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise

## నేడు నవాబుపేటకు ఐజీ రాక

**వికారాబాద్,జూన్ 9(నినాదం):** ప్రభుత్వం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఐ జీ షానవాజ్ ఖాసీం ఐ పిఎస్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ లు హాజరు కానున్నారని స్థానిక ఎస్ఐ గిరి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రత, రోడ్డు ప్రయాణం లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన పెంపొందించడం ప్రాధానమని అన్నారు.

# శ్వాస కోశ వ్యాధులతో.. శవాలవుతున్నా పట్టింపే లేదా?

డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు సైనికుల్లా ఉద్యమిద్దాం

కలుషిత వాతావరణంలో బతుకులు బుగ్గి పాలేనా?

ప్రభుత్వం పట్టించుకోకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తాం

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ కో- కన్వీనర్లు





**జవహర్ నగర్, జూన్9 (నినాదం):** శ్వాస కోశ వ్యాధులతో ప్రజలు శవాలవుతున్న... ప్రభుత్వానికి పట్టింపు లేదా డంపింగ్ యార్డ్ ను పూర్తిస్థాయిలో ఎత్తివేసి ప్రాణాలను కాపాడాలని లేకుంటే ఇంటికో వ్యక్తి సైనికుడిలా పోరాడుతూ ఉద్యమిద్దామని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ కో కన్వీనర్లు పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి కన్వీనర్ ఉమా మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ ప్రగతి నగర్ లోని నీలం రామచంద్రయ్య భవన్లో డంపింగ్ భూతాన్ని పారదోలాలని భవిష్యత్ కార్యాచరణ పై కో కన్వీనర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలు ముదిరాజ్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలు పూర్తిగా కలుషితమయ్యాయని పశు పక్షాదులు కూడా బ్రతకలేని దుస్థితి నెలకొందని చెత్తతో గుట్టలు గుట్టలుగా మారిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని దుయ్యబట్టారు. దుర్వాసనను భరించలేక ప్రజలు ఇప్పటికే ఇళ్లను ఖాళీ చేస్తున్నారని ప్రజల జీవనస్థితి పై రాంకీ అరాచకాన్ని ప్రభుత్వం కూకటి వేళ్ళతో కదిలించి ప్రశాంత వాతావరణము కల్పించాలని అన్నారు. డంపింగ్ యార్డ్ ఎత్తివేతకై శాంతియుతంగా పోరాటం తీవ్రతరం చేద్దామని ఈనెల 15న మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతి పత్రాలు సమర్పిద్దామని ఈనెల 23వ తేదీన ప్రజాభవన్లో వినతి పత్రాలు సమర్పిద్దామని తెలిపారు. జూలై 26న వెయ్యి మందితో పర్యావరణ శాస్త్రవేత్తలతో భారీ ఎత్తున సదస్సును నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డ్ ప్రభావిత చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాదయాత్రలు చేసి నిరసన చేపాడుదామని తెలిపారు. ఆయా ప్రాంతాల స్థానిక ప్రజా ప్రతినిధులు పార్టీ సంఘాలు కలిసి డంపింగ్ యార్డ్ ఎత్తివేతకై జరిగే ప్రజా ఆందోళనలో భాగస్వాములు చేస్తామని తెలిపారు. పంచభూతాల సాక్షిగా జవహర్ నగర్ లో ప్రజలకు జీవించే హక్కు ఉందని అన్ని వర్గాల ప్రజలు జీవించే హక్కులో భాగంగా జరిగే ప్రజాస్వామిక న్యాయమైన పోరాటానికి ప్రజాస్వామిక మేధావులు సబ్బండ వర్గాల ప్రజలు న్యాయ కోవిదులు విద్యావంతులు పర్యావరణవేత్తలు సంపూర్ణ మద్దతు తెలిపాలని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ విముక్తి కోసం ప్రతి ఇంటి నుండి ప్రజల స్వచ్ఛందంగా కదిలి రావాలని పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్నట్టు పోరాడితేనే మానవ జీవన మనుగడ సాగుతుందని లేదంటే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. జూలై 26న పెద్ద ఎత్తున సదస్సు నిర్వహిస్తున్నామని ప్రతి కాలనీకి డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీలు చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి శంకర్, శివ బాబు, అరుణ, సుబ్రహ్మణ్యం, సునీత, సావిత్రి, శివన్నారాయణ, బాల నరసింహ గౌడ్, లక్ష్మీబాయి, ప్రఫుల్ రాంరెడ్డి, చంద్రమౌళి, వెంకన్న తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ..

నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ ఐఏఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి, జూన్ 9(నినాదం) :** మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించి వినతిపత్రం ను అందజేశారు. పలు అబివృద్ధి అంశాలను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే మర్రి కౌకూర్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నివసిస్తున్న ప్రజలకు తక్షణమే తాగునీటి వసతి కల్పించాలని మౌలాలి ఆయుష్ వెల్నెస్ సెంటర్, యునాని హాస్పిటల్ పరిధిలో ఉన్న హౌసింగ్ బోర్డు స్థలంలో మౌలాలి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూ పీ హెచ్ సీ) నిర్మాణానికి స్థలం కేటాయించాలని అల్వాల్ ప్రాంతంలోని భూధాన్ ల్యాండ్స్ సర్వే నంబర్లు 537, 538, 539, 540లలో పేద ప్రజల గృహ అవసరాల దృష్ట్యా 2 బి హెచ్ కె గృహల నిర్మాణం చేపట్టాలని... నేరేడ్ మెట్ డివిజన్ రామకృష్ణాపురంలోని సర్వే నంబర్ 246లో ఉన్న ప్రభుత్వ స్థలంలో 2 బి హెచ్ కె గృహాలను నిర్మించాలని, సీబీఎన్ కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న వాంబే గృహ సముదాయాన్ని కూల్చివేసి ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ ఐఏఎస్, సంబంధిత ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, జేఏసీ వెంకన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాల పనులను వేగవంతం చేయాలి

జి కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జూన్9 (నినాదం):** ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో రాంనగర్ ప్రాంతంలో చేపట్టిన పట్టణ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల లో భాగంగా బెల్లంపలిలో చేపట్టిన పాఠశాల పనులను పరిశీలించారు. కన్నేపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయ పాలన పాటించాలని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న భోజనశాల, ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.





# అమ్మానాన్నల త్యాగాలకు విద్యార్థుల వందనం



టెన్త్ టాపర్ల చేతుల మీదుగా తల్లిదండ్రులకు ఘన సన్మానం

ఎంత ఎదిగినా అమ్మానాన్నలను మరువొద్దు

ఢిల్లీ స్థాయి బాధ్యతల్లోనూ.. సొంత గడ్డపై ప్రేమ

విద్యార్థులకు రోల్ మోడల్ 'వడ్డేపల్లి రామచందర్'

20 ఏళ్ల బంధం.. కష్టకాలంలో తోడు

పదవులు వస్తాయి.. పోతాయి, మీ ప్రేమే నా ఆస్తి

కరోనా వేళ నా భర్తే నాకు దేవుడు

బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి

భావోద్వేగాల మధ్య సాగిన 'అమ్మా నాన్నకు ప్రేమతో' పురస్కారాల వేడుక

**గోదావరిఖని, జూన్ 09 (నినాదం):** రామ గుండం నియోజకవర్గంలో నిర్వహించిన "అమ్మా నాన్నకు ప్రేమతో" పురస్కారాల కార్యక్రమం హృదయాలను హత్తుకునేలా సాగింది. పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, వారి విజయాల వెనుక ఉన్న తల్లిదండ్రుల త్యాగాలను గుర్తిస్తూ ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు శాలువాలు కప్పి సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు ఆనందభాష్పాలు పెట్టుకోవడంతో సభలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. సంధ్యారాణి మాట్లాడుతూ, నేటి పిల్లల విజయాల వెనుక తల్లి ప్రేమ, తండ్రి కష్టం దాగి ఉంటాయని పేర్కొన్నారు. జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలకు చేరుకున్నా తల్లిదండ్రులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యతో పాటు విలువలు, సంస్కారం కూడా సమానంగా అవసరమని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ యువతకు ఆదర్శప్రాయ వ్యక్తిగా నిలుస్తున్నారని ఆమె కొనియాడారు. జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ సొంత ప్రాంత ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇరవై సంవత్సరాలుగా ప్రజలతో ఏర్పడిన అనుబంధమే తనకు అతిపెద్ద బలం అని సంధ్యారాణి తెలిపారు. కరోనా సంక్షోభ సమయంలో ప్రజల కోసం చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆ సమయంలో తన భర్త కందుల పోషం అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. టెన్త్ క్లాస్ జీవితంలో ఒక మైలురాయి మాత్రమేనని, భవిష్యత్తులో ఉన్నత పదవులు, గొప్ప విజయాలు సాధించినా తల్లిదండ్రుల ఆశీస్సులు, ప్రేమను మరువకూడదని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో కుటుంబ విలువలు, తల్లిదండ్రుల పట్ల గౌరవ భావన మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

# ధర్మారం-రాజారంపల్లి రహదారి దుస్థితిపై గ్రామస్తుల ఆందోళన

గుంతలమయమైన రోడ్డుతో నిత్యం ప్రమాదాలు.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు వినతి



**పాలకుర్తి, జూన్ 9 (నినాదం) :** పాలకుర్తి మండల పరిధిలోని ధర్మారం క్రాస్ రోడ్ నుంచి రాజారంపల్లి వరకు ఉన్న ప్రధాన ఆర్‌డబీ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోజురోజుకూ రహదారి దుస్థితి మరింత అధ్వాన్నంగా మారడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. జయ్యారం, పైడిచింతలపల్లి, మారేడుపల్లి ప్రాంతాల్లో ఉన్న క్రషర్ యూనిట్ల నుంచి అధిక లోడుతో రాకపోకలు సాగించే భారీ లారీలు రహదారి దెబ్బతినడానికి ప్రధాన కారణమని స్థానికులు పేర్కొన్నారు. అదేవిధంగా పెద్దపల్లి-గోదావరిఖని రాజీవ్ రహదారిని చొప్పదండి-లక్షెట్టిపేట మార్గంతో అనుసంధానించే కీలక రహదారి కావడంతో బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, నిజామాబాద్ ప్రాంతాలకు వెళ్లే సిమెంట్ లోడ్ వాహనాలు అధికంగా ఈ మార్గాన్ని వినియోగిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రహదారిని తక్షణమే మరమ్మతు చేయాలని కోరుతూ గ్రామస్తుల ఆధ్వర్యంలో జిల్లా రోడ్లు మరియు భవనాల శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. అధికారుల హామీ వినతిపత్రాన్ని స్వీకరించిన సంబంధిత అధికారి స్పందిస్తూ సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సర్వే నివేదిక ఆధారంగా రహదారి మరమ్మతుల పనులను అత్యవసరంగా చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు. ఈ కార్యక్రమంలో పుట్నూర్ ఉపసర్పంచ్ అల్లం శివకుమార్, వార్డు సభ్యులు చొప్పదండి భూమయ్య, బౌతు శ్రీకాంత్, గ్రామస్తులు వేల్పుల రాజ్‌కుమార్, దుర్గం మల్లేష్, వైద్య నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన

# కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల బ్యూరో, జూన్9 (నినాదం) :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లలో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ ఐఏఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే



**అల్వాల్, జూన్ 9(నినాదం) :** మంగళవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గ తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చించి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు కింది అంశాలను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. కౌకూర్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నివసిస్తున్న ప్రజలకు తక్షణమే తాగునీటి వసతి కల్పించాలి. అల్వాల్ ప్రాంతంలోని భూధాన్ ల్యాండ్స్ సర్వే నంబర్లు 537, 538, 539, 540లలో పేద ప్రజల గృహ అవసరాల దృష్ట్యా డబల్ బెడ్ రూమ్ గృహాల నిర్మాణం చేపట్టాలి. సీబీఎన్ కాలనీలో శిథిలావస్థకు చేరుకున్న వాంబే గృహ సముదాయాన్ని కూల్చివేసి ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మాణం చేపట్టాలి. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్, సంబంధిత ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



# పాడి రైతుల ధర్నా.. దిగొచ్చిన యాజమాన్యం!

**కోదాడ,జూన్ 9(నినాదం):** పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా బాలాజీనగర్‌లోని కోదాడ--హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై మంగళవారం పాడి రైతులు భారీ రాస్తారోకో నిర్వహించారు. మదర్ డైరీ పరిధిలో పనిచేస్తున్న ఏడు పాల సేకరణ సంఘాలకు సంబంధించిన సుమారు రూ.17 లక్షల బకాయిలు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, నెలల తరబడి తమకు రావాల్సిన పాల బిల్లులు చెల్లించకుండా మదర్ డైరీ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడం అన్యాయమని విమర్శించారు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ యాజమాన్యం సమస్యను పట్టించుకోలేదని ఆరోపించారు.రాస్తారోకో కారణంగా కోదాడ--హుజూర్‌నగర్ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. అనంతరం ఢిల్లీ నేషనల్ డైరీ సీఈఓ లింగారెడ్డి ఆందోళన చేస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రూ.17 లక్షల బకాయిలను రెండు వారాల్లో పూర్తిగా చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే రైతులకు సంబంధించిన ఇతర ఆర్థిక అంశాలను కూడా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. అయితే బకాయిల చెల్లింపుతో పాటు పశువుల మేత, దాణా కొనుగోళ్ల కోసం ముందస్తు ఖర్చులను కూడా విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నిర్ణీత గడువులోగా అమలు చేయకపోతే మరింత తీవ్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలు పాల సేకరణ సంఘాల ప్రతినిధులు, పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఈతను పాఠ్యాంశంలో చేరుస్తామని ప్రకటన చేసిన మంత్రికి కృతజ్ఞతలు

కోలా రవీందర్ ముదిరాజ్



**కుత్బుల్లాపూర్, జూన్9 (నినాదం) :** పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు విధిగా ఇతను నేర్పించుటకు కావలసిన చర్యలు తీసుకోవాలని ఈతను పాఠ్యాంశంలో చేరుస్తామని రాష్ట్ర మంత్రి వాకిడి శ్రీహరి ప్రకటన చేశారు. విద్యార్థులకు ఇతను ఒక సాధనంగా నేర్పించాలని ఇతని నేర్చుకున్న విద్యార్థులకు పరీక్షలలో అదనంగా రెండు మార్కులు కలిపేలా చర్యలు తీసుకోవాలంటూ దశాబ్దాల కాలంగా పర్యావరణ ప్రేమికుడు, సామాజిక సేవా కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ చేసిన సేవకు గుర్తింపు కలగడంతో ఆయన ఆనందంతో మునిగితేలారు. ఈ సంతోషకర సమయంలో ఇతను పాఠ్యాంశంలో చేరుస్తామని ప్రకటన చేసిన మంత్రి వాకిడి శ్రీహరిని మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ తో కలిసి మంత్రిని కలిసి శాలువా కప్పి, కర్రతో చేసిన చేప బొమ్మను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఇతను పాఠ్యాంశంలో చేర్చాలని నేను చేసిన నా పోరాటం 25 ఏళ్లుగా అన్ని ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోని మంత్రి వాకిడి శ్రీహరి స్పందిస్తూ ఈతను పాఠ్యాంశంగా తప్పనిసరిగా చేర్చుటకు క్యాబినెట్ సమావేశంలో లో పెట్టి ముఖ్యమంత్రితో చర్చించి పాఠ్యఅంశంలో చేర్చే విధంగా చర్యలు తీసుకుంటానని భరోసా ఇవ్వడంతో తన పోరాటం ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు.ఈతను ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చాలని నిర్ణయం తీసుకొని ఆ వెంటనే సంబంధిత అధికారులకు, క్రీడా శాఖ అధికారులకు, విద్యాశాఖ అధికారులకు చరవాణి ద్వారా మంత్రి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఈతను ఒక పాఠ్యాంశముగా తయారు చేయుటకు జరగబోయే క్యాబినెట్ మీటింగ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి కి వివరించి ఆదేశాలు ఇచ్చే విధంగా ప్రత్యేక చొరవ తీసుకుంటానని మంత్రి భరోసా ఇవ్వడం ఆనందించదగ్గ విషయం అన్నారు. ఈతను పాఠ్యాంశంలో చేర్చడానికి హామీ ఇస్తున్నానని మొన్ననే మా నియోజకవర్గంలోని నలుగురు పిల్లలు ఈత రాని కారణంగా నీటిలో మునిగి మృతి చెందారని మంత్రి వాకిడి శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు.కోలా రవీందర్ ముదిరాజ్ విద్యార్థులకు ఈతను విధిగా నేర్పించాలంటూ ఇతను అవగాహన కల్పించుటకు ప్రత్యేక పాఠ్యాంశాన్ని చేర్చాలని చేస్తున్న పోరాటాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నానని మంత్రి కోల రవీందర్ ముదిరాజును అభినందించారు. కోలా రవీందర్ ముదిరాజ్ ఈతను ఒక సాధనంగా నేర్పించాలంటూ చేస్తున్న పోరాటానికి సంబంధించిన వివరాలు ఈత రాకపోవడంతో ప్రతి సంవత్సరం వివిధ ప్రాంతాలలో రాష్ట్రాలలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు సంబంధించిన వివరాలను (సేకరిస్తున్నటువంటి ఈ యొక్క డాటాను) చూసి అభినందిస్తున్నానని రవీందర్ ముదిరాజును మంత్రి శాలువతో సన్మానించారు.నీవద్ద ఇంకేదైనా సమాచారం, ఉంటే నాకు అందించాని మంత్రి రవీందర్ ముదిరాజ్ కు సూచించినట్లు రవీందర్ ముదిరాజ్ ప్రకటనలో వివరించారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి మాజీ కార్పొరేటర్,సర్పంచ్ ఆగం పాండు, రాబోలు,జితేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలిస్తే ప్రజాస్వామ్యం.. చీలితే ఫాసిజం!

సంపాదకీయం

**భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు నేడు ఒక కీలక మలుపు వద్ద నిలిచాయి. ఒకవైపు ప్రజాస్వామ్య వ్యవస్థను క్రమంగా బలహీనపరుస్తూ అధికార కేంద్రీకరణను పెంచుతున్న బీజేపీ పాలన, మరోవైపు దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ గుత్తాధిపతుల చేతుల్లో కేంద్రీకరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు దేశ భవిష్యత్తుపై ప్రశ్నార్థక చిహ్నాలు మిగులుస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఇండియా కూటమి సమావేశం కేవలం రాజకీయ కార్యక్రమం కాదు; దేశ ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్య విలువల పరిరక్షణ కోసం అవసరమైన రాజకీయ ప్రతిస్పందనగా చూడాల్సిన అవసరం ఉంది.**

ఫాసిజం అంటే కేవలం నియంతృత్వ పాలన మాత్రమే కాదు. కార్పొరేట్ మూలధన ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడం, ప్రజల్లో మత, కుల, ప్రాంతీయ విభజనలను రెచ్చగొట్టడం, ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించడం కూడా ఫాసిస్టు రాజకీయాల లక్షణాలే. నేడు దేశంలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే ఈ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

దేశంలో నిరుద్యోగం చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరుగుతోంది. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కార్మికుల హక్కులు క్రమంగా కుదించబడుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు బలహీనపడుతున్నాయి. అయితే ఈ సమస్యలపై చర్చ జరగకుండా మతపరమైన ఉద్రిక్తతలు, చరిత్ర వివాదాలు, ద్వేష రాజకీయాలు ముందుకు తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోంది.

ప్రజల చెమటతో నిర్మించిన విమానాశ్రయాలు, పోర్టులు, గనులు, విద్యుత్ రంగ సంస్థలు, సహజ వనరులు క్రమంగా కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లడం యాదృచ్ఛికం కాదు. ఇది కార్పొరేట్–రాజకీయ కుమ్మక్కు ఫలితం. దేశ సంపద కొద్దిమంది బిలియనీర్ల చేతుల్లో కేంద్రీకృతమవుతుంటే, కోట్లాది మంది యువకులు ఉద్యోగాల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇదే నయా ఉదారవాద విధానాల అసలు ముఖచిత్రం.

ఇలాంటి సమయంలో ప్రతిపక్ష రాజకీయ శక్తుల ఐక్యత అత్యంత అవసరం. కాంగ్రెస్, వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు, సామాజిక న్యాయ శక్తులు, లౌకికవాద సంస్థలు ఒకే వేదికపైకి రావడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పరిణామం. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం లేకపోతే అధికార అహంకారం నియంతృత్వంగా మారే ప్రమాదం ఉంటుంది.

అయితే కేవలం ఎన్నికల పొత్తులు సరిపోవు. ప్రజల జీవన సమస్యలపై ఉమ్మడి పోరాటాలు అవసరం. రైతుల కోసం కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ, కార్మికులకు ఉద్యోగ భద్రత, యువతకు ఉపాధి, మహిళలకు భద్రత, ప్రభుత్వ విద్యా–వైద్య రంగాల బలోపేతం, ప్రభుత్వ రంగ పరిరక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలపై స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానాలు ఉండాలి. అప్పుడే ప్రజలు ఈ ఐక్యతను తమ ఐక్యతగా భావిస్తారు.

నేడు దేశానికి ఎదురవుతున్న ప్రమాదం కేవలం ఒక పార్టీ ఆధిపత్యం కాదు; ప్రజాస్వామ్య విలువల క్షీణత. రాజ్యాంగ స్ఫూర్తి బలహీనపడటం. విభిన్న స్వరాలను దేశద్రోహంగా చిత్రీకరించే రాజకీయ సంస్కృతి పెరగడం. మీడియాపై ఒత్తిళ్లు, దర్యాప్తు సంస్థల రాజకీయ వినియోగం, రాష్ట్రాల హక్కులపై దాడులు——ఇవి కలిసి భారత సమాఖ్య ప్రజాస్వామ్యానికి సవాళ్లుగా మారాయి.

1అందుకే ఇండియా కూటమి వంటి ప్రయత్నాలను కేవలం ఎన్నికల లెక్కలతో కొలవకూడదు. అవి ప్రజాస్వామ్యాన్ని కాపాడే రాజకీయ కవచంగా, కార్పొరేట్ పెత్తనానికి ఎదురొడ్డి నిలిచే వేదికగా, ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా ఏర్పడుతున్న విస్తృత ప్రజా ఐక్యతగా అభివృద్ధి చెందాలి.

చరిత్ర చెబుతున్న సత్యం ఒక్కటే——ఫాసిజాన్ని ఓడించేది ఒక్క పార్టీ కాదు, ప్రజల ఐక్య పోరాటమే. కార్పొరేట్ దోపిడీని అడ్డుకునేది ఒక్క నాయకుడు కాదు, శ్రమజీవుల సంఘటిత శక్తే. కాబట్టి నేటి పిలుపు స్పష్టంగా ఉండాలి:

**"రాజ్యాంగాన్ని కాపాడుకుందాం... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం... ఫాసిస్టు దూకుడును తిప్పికొడదాం... కార్పొరేట్ పెత్తనాన్ని సవాలు చేద్దాం... ప్రజల భారతాన్ని నిర్మిద్దాం!"**

# ట్రంప్‌కు వీసా దెబ్బ!



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడిపోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది.

దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్`1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యుఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది.

అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్`1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్`1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్`1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది.

ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్`1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది.

ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్`1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ దయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు.

హెచ్`1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రయాపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు.

చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్`1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్`1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యుఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమొక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్

**జూన్ 10... పౌర హక్కుల పోరాట యోధుని జయంతి**



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం– కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలు గా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్‌డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకుడిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకుడాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్‌సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్‌సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులతో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది.

బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్య హింస తోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి. మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శిం చడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్‌లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్‌ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ–మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్యకలాపాలను విస్తరిం చాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాల గోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కో వటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్‌కౌంట ర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారా హిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

డిజిటల్ సోషల్ మీడియా, సినిమాలలో అశ్లీలత, ప్రమాదకరమైన స్టంట్లపై

# నియంత్రణ అత్యవసరం

నేటి ఆధునిక సమాజంలో డిజిటల్ సోషల్ మీడియా మనిషి జీవన విధానంలో ఒక భాగంగా మారిపోయింది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, వెబ్ సిరీస్‌లు, సినిమాలు, షార్ట్ వీడియో యాప్స్ ఇవన్నీ వినోదానికి మాత్రమే కాకుండా మన ఆలోచనలపై, ప్రవర్తనపై, ముఖ్యంగా యువత మానసిక స్థితిపై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. సాంకేతిక అభివృద్ధి సమాజానికి ఎంతో మేలు చేస్తున్నప్పటికీ, అదే టెక్నాలజీని తప్పుదోవలో ఉపయోగించడం వల్ల సమాజంలో అనేక విపరీత ధోరణులు పెరుగుతున్నాయి. ఆకర్షణ అనేది ఒక్క క్షణంలో కలిగే భావన. అది చిన్నవారైనా, పెద్దవారైనా, చదువుకున్నవారైనా, సాధారణ వ్యక్తులైనా ఎవరినీ వదలదు. ప్రస్తుతం డిజిటల్ సోషల్ ప్లాట్‌ఫామ్స్‌లో ప్రసిద్ధి కోసం, ఫాలోవర్స్ కోసం, వ్యూస్ కోసం కొంతమంది హద్దులు దాటే కంటెంట్‌ను రూపొందిస్తున్నారు. అశ్లీలత, అసభ్యత, శరీర ప్రదర్శన, ద్వంద్వార్థ సంభాషణలు వంటి విషయాలను వినోదం పేరుతో ప్రచారం చేస్తున్నారు. ఆ వీడియోలను చూసే కొందరు యువత ప్రభావితమై తప్పుదోవ పడుతున్నారు. తాత్కాలిక ఆకర్షణ వల్ల జీవితాలను పాడు చేసుకుంటున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో సోషల్ మీడియా ద్వారా కేవలం కొన్ని నిమిషాల్లోనే లక్షల మందికి కంటెంట్ చేరుతుంది. అందులో మంచి విషయాలు ఉంటే సమాజం ముందుకు వెళ్తుంది. కానీ చెడు ధోరణులు ఉంటే అవి కూడా అంతకంటే వేగంగా వ్యాపిస్తాయి. విచారకరమైన విషయం ఏమిటంటే, కొందరు తమ వీడియోలు వైరల్ కావాలని, తాము సెలబ్రిటీలు కావాలని అసభ్యకరమైన కంటెంట్‌ను సృష్టిస్తున్నారు. తర్వాత అదే కంటెంట్ వల్ల సమాజంలో జరిగే అనర్థాలపై చర్చలు జరుగుతున్నాయి. ఇది బాధాకరమైన పరిస్థితి. సినిమాలు, సీరియళ్లు, వెబ్ సిరీస్‌లలో కూడా ఇటీవల అశ్లీలత మోతాదు అధికమవుతోంది. కథలో అవసరం లేకపోయినా యువతను ఆకర్షించాలనే ఉద్దేశంతో అసభ్యకర దృశ్యాలు, సంభాషణలు చేర్చడం పెరిగింది. వీటిని ఎక్కువసేపు చూస్తున్న యువతలో ఆలోచనా విధానం మారిపోతోంది. మహిళలను గౌరవంతో కాకుండా ఆకర్షణ కోణంలో చూడటం, ప్రేమను తప్పుగా అర్థం చేసుకోవడం, సంబంధాల విలువ తగ్గిపోవడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. మన దేశం "వంద దోషులు తప్పించుకున్నా ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదు" అనే మానవతా భావనతో నడుస్తుంది. కానీ నేడు విపరీత ధోరణులు, అశ్లీల ప్రచారాలు కారణంగా ఎంతోమంది యువకులు తెలియకుండానే దోషులుగా మారుతున్నారు. క్షణిక ఆకర్షణ వల్ల నేరాలకు పాల్పడుతున్నారు. తరువాత జీవితాన్ని నష్టపోతున్నారు, జీవితాంతం పశ్చాత్తాపంతో జీవిస్తున్నారు. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి నియంత్రణ లేని డిజిటల్ కంటెంట్. అభివృద్ధి అంటే కేవలం టెక్నాలజీ పెరగడం కాదు. మన ఆలోచనలు, సంస్కారం, బాధ్యత కూడా పెరగాలి. సమాజానికి ఉపయోగపడే కంటెంట్‌ను ప్రోత్సహించాలి. యువతకు స్ఫూర్తినిచ్చే సినిమాలు, విలువలను నేర్పే కథలు, జ్ఞానం పెంచే వీడియోలు ఎక్కువగా రావాలి. వినోదం అవసరమే కానీ అది విలువలు కోల్పోయే స్థాయికి వెళ్లకూడదు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఏం చూస్తున్నారు, ఎలాంటి కంటెంట్‌ను అనుసరిస్తున్నారు అనే విషయంపై శ్రద్ధ పెట్టాలి. పాఠశాలలు, కళాశాలలు విద్యతో పాటు నైతిక విలువలను కూడా బోధించాలి. ప్రభుత్వం, సెన్సార్ వ్యవస్థ, డిజిటల్ సోషల్ ప్లాట్‌ఫామ్స్ కూడా సమాజ బాధ్యతను గుర్తించి అశ్లీల కంటెంట్‌పై కఠిన నియంత్రణలు తీసుకురావాలి. మరికొందరు ఎక్కువ వ్యూస్, లైక్స్, ఫాలోవర్ల కోసం ప్రమాదకరమైన స్టంట్లు చేస్తున్నారు. రైళ్లపై ఎక్కడం, వేగంగా వాహనాలు నడపడం, ఎత్తైన ప్రదేశాల్లో సెల్ఫీలు తీసుకోవడం, ప్రమాదకర విన్యాసాలు చేయడం వంటి చర్యలు ప్రాణాలకే ప్రమాదంగా మారుతున్నాయి. వీటిని చూసి సరైన అవగాహన లేని యువత, చిన్నారులు కూడా వాటిని అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారు. వీడియోలో కనిపించే కొన్ని క్షణాల వినోదం వెనుక ఎంతటి ప్రమాదం దాగి ఉందో గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు తీవ్ర గాయాలకు గురవుతుండగా, మరికొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఒక వ్యక్తి చేసిన నిర్లక్ష్యపు పని వల్ల కుటుంబం మొత్తం బాధపడాల్సి వస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను కోల్పోతారు, కుటుంబం ఆర్థికంగా మరియు మానసికంగా నష్టపోతుంది. కేవలం కొన్ని లైక్స్, షేర్ల కోసం జీవితాన్ని పణంగా పెట్టడం ఎంత మాత్రం సమంజసం కాదు. సోషల్ మీడియాను మంచి విషయాల కోసం, జ్ఞానాన్ని పెంచుకోవడానికి, ప్రతిభను ప్రదర్శించడానికి ఉపయోగించాలి. ప్రమాదకర స్టంట్లను ప్రోత్సహించకుండా, వాటి వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. యువత కూడా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటేనే తమ భవిష్యత్తును సురక్షితంగా కాపాడుకోగలరు. సమాజం అభివృద్ధి చెందాలంటే మంచి ఆలోచనలు పెరగాలి కానీ విపరీత పోకడలు కాదు. ఒక వ్యక్తి చేసే తప్పు అతని జీవితాన్నే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. కాబట్టి సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత. వినోదం పేరుతో విలువలను కోల్పోకూడదు, సాంకేతికత మనిషిని ఎదగనివ్వాలి కానీ చెడగొట్టకూడదు.



**డాక్టర్. వై. సంజీవ కుమార్, ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్, 9393613555, 9493613555..**

# పెన్ను హస్తభుషణమే కాదు మస్తిష్క వికాస సాధనం

**(10 జూన్ "జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం" సందర్భంగా)**

పలక, బలపంతో అక్షరాలు దిద్దిన తర్వాత పెన్ను పట్టుకునే అర్హత వస్తుంది మనందరికీ. బలపం రాతలను చెరప వచ్చేమోగాని పెన్నుతో రాసిన రాతల్ని కొట్టి వేయవచ్చు కాని అసలే చెప్పలేం. అలా అక్షరాభ్యాసం నుంచి అంతిమ గడియల వరకు మన జేబుకు ఓ అలంకారమై, మనకు తెలియకుండానే మన గౌరవాన్ని పెంచుతోంది విలువైన మన ఆత్మీయ నేస్తమైన పెన్ను లేదా కలం. నాటి పాళీ ఇంకు పెన్ను అంతరించి నేడు బాల్ పాయింట్ పెన్ను రాజ్యమేలుతోంది. అలా రాయడానికి నేడు అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం "బాల్‌పాయింట్" పెన్ లేదా "బాల్ పెన్" అని మనకు తెలుసు. చిన్నారి నుంచి పండు ముసలి వరకు అందరి హస్త భూషణం బాల్ పెన్. బాల్ పెన్‌ను చూడని, స్పర్శించని వారు ఉంచారా ! విద్యా బోధన, విద్యావంతుల జేబు భూషణం, వ్యాపార గణాంకాల పునాది, సమాచార వితరణశీలి పెన్ను మాత్రమే. నేడు ప్రపంచవ్యాప్తంగా పెన్ను అంటేనే బాల్‌పాయింట్ పెన్ అనేది నిర్వివాదాంశం. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా మన ఇంటి నేస్తం అయ్యింది బాల్ పెన్ను. గతంలో ఇంకులో ముంచి రాసుకునే పన్నులు, సిరా నింపి రాసుకునే పన్నులను చూసాం. నేడు ఇంకా పెన్ను అంతరించిపోయింది. బాల్‌పాయింట్ పెన్ను మన నిత్య నేస్తం అయ్యింది.

### జాతీయ బాల్‌పాయించ్ పెన్ దినోత్సవం:

1888లో జాన్ లావుడ్ అనే శాస్త్రవేత్త ఇంకు పెన్నును కనుగొనడం జరిగింది. ఇంకు పెన్ను వాడుకలో వచ్చిన అసౌకర్యాల వల్ల మరో మెరుగైన పెన్ను అవసరం ఏర్పడింది. 1938లో "లాజ్లో బిరో" అనే హంగేరియన్ జర్నలిస్టు బాల్‌పాయింట్ పెన్నులు తెలిసాయి రూపొందించడం, తర్వాత 10 జూన్ 1943న తన సోదరుడు ఇంజనీర్ "జియార్జీ బిరో"తో కలిసి బాల్పాయింట్ పెన్నును పెటెంట్ చేయడం జరిగింది. ఈ పరమ అద్భుత ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 10 జూన్‌న ప్రపంచ దేశాలు "జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం (నేషనల్ బాల్‌పాయింట్ పెన్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. జాతీయ బాల్ పాయింట్ పెన్ దినం వేదికగా పెన్నులు కృతజ్ఞతలు తెలపడం, వివిధ రకాల పెన్నుల ప్రదర్శనలు, పెన్నులను అలంకరించి కృతజ్ఞతలు తెలపడం, పెన్‌తో మన ఆప్తులకు ఉత్తరం రాయడం, పెన్ను ప్రాధాన్యాన్ని గూర్చి వ్యాసం రాయడం, బాల్ పెన్ ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

రాయడానికి చవకైన ఏకైక ఉత్తమ సాధనం:

నాటి నుంచి నేటి వరకు విద్యాలయాలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, కార్యాలయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్ని వర్గాల ప్రజలు/యివా/పిల్లలకు ఆత్మీయ నేస్తంగా, గౌరవాన్ని పెంచే చవకైన సాధనంగా, జేబుకు అలంకారంగా బాల్‌పాయింట్ పెన్ను అపార అద్వితీయ సేవలను అందిస్తున్నది. బాల్‌పాటింట్ పెన్ సాధనంగా విద్యా బోధనలు, సాంస్కృతిక వికాసం, ఆర్థిక వ్యవస్థలు, సగటు మనిషి జీవనశైలిలో ఓ అవిభాజ్య భాగం అయ్యింది. ఒక్క బాల్‌పాయింట్ పెన్‌తో దాదాపు 50,000 పదాలు రాస్తూ 100 పేజీల వరకు రాయవచ్చు. ప్రతి ఒక్కరు సాలీనా సగటున 4.3 బాల్ పెన్నులను వాడడం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా సెకనుకు 125 బాల్ పెన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. పలు రకాల బ్రాండ్లు, అద్భుత ఆకృతులు, ఆకర్షణీయ కళా సంపదలతో బాల్ పెన్నులు మనకు అందుబాటులో ఉన్నాయి. తరగతి గది గుండెకాయ బాల్ పెన్ అని తెలుసుకోవాలి. అందరికీ చవకగా అందుబాటులో ఉన్న బాల్‌పాయింట్ పెన్నులు నమ్మకమైన, నాణ్యమైన, మృదు రాతల ధారలు పారిస్తున్నాయి. తేలికగా పేపరుపై పారడం, సులభంగా ఆరిపోవడం, అందమైన రాతలకు వారధిగా కావడం బాల్ పెన్ను ప్రత్యేకతలుగా పేర్కొనాలి.

ఆకర్షణీయమైన రంగులు, వివిధ కళాకృతులతో నేడు బాల్ పెన్నులు పిల్లలు/యువతలో చదుకోవాలనే, రాయాలనే ఉత్సుకతను ప్రేరేపిస్తున్నాయి. నేడు అందమైన బాల్‌పాయింట్ పెన్నులు వ్యక్తుల స్థాయిని, వ్యక్తిత్వాలను చెప్పకనే చెబుతున్నాయి. మన జేబులో చేరిన పెన్ను మన హృదయ ఉపరితలంపై నాట్యమాడుతూ మనకు సమోన్నత గౌరవాన్ని ఆర్జించి పెడుతున్నాయి. మన జీవితంలో ఒక విడదీయరాని భాగమైన బాల్‌పాయింట్ పెన్నులను పూజాగదిలో ఇష్టదైవం ముందు పెట్టి మనకు విజ్ఞాన వివేకాలను అందించమని వేడుకుందాం. మన బాల్‌పాయింట్ పెన్నుకు శతకోటి వందనాలు అర్పిద్దాం, సన్మార్గంలో నడిచే ధైర్యాన్ని ఇవ్వమని వేడుకుందాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**



## ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలి

**విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ ప్రతినిధి, జూన్ 9 (నినాదం ):** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంతోపాటు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.
పాఠశాలలు త్వరలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా విద్యాబోధన సాగాలని సూచించారు. ఇప్పటికే మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ దాదాపు పూర్తయిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.
అన్ని విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాలలు, వసతి గృహాలు, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నందున, వసతి గృహాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాల గడువు తేదీలను పరిశీలించి, నాసిరకం లేదా గడువు ముగిసిన సరుకులు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
నాణ్యమైన భోజనాన్ని అందించడంలో మెస్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ భోజన ప్రమాణాలు, ఆహార పదార్థాల నాణ్యతను మెస్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్టోర్ రూమ్‌లలో కూరగాయలు, ఇతర వస్తువులను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని, తప్పనిసరిగా మాస్కులు, ఏప్రాన్‌లు, తల టోపీలు ధరించాలని ఆదేశించారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు వంటశాలల్లో మిగిలిన ఆహారం, చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు.
ముఖ్యంగా వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు వసతి గృహాల్లో ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, ఎంఈఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

## మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, జూన్ 9(నినాదం)**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.



**14 క్లస్టర్లలో వెల్లువెత్తిన జనసందోహం.. 24వేల పైచిలుకు దరఖాస్తులు.**

పాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి, గత 25 నుండి 30 రోజులుగా 'ప్రజల వద్దకే ప్రభుత్వం' అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలను స్వయంగా కళ్లారా చూసి, చెవులారా విన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి మొత్తం 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,000 అర్జీలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతో పాటు అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు.

**భూ భారతి చట్టంతో సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం.**

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి మండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

**ఆధునిక డిజిటల్ సర్వే.. సాగులో ఉన్న వారికే భూమి పట్టాలు.**

తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి) గ్రామంలో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి, పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు.

**నిర్ణీత కాలపరిమితిలోగా గృహాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు.**

ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారుల యంత్రాంగాన్ని విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

**ప్రతిపక్షాల బురదజల్లే రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు**

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొరపాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాలు చేసే విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా సానుకూలంగా తీసుకుని తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన వారు కేవలం కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాదని, అన్ని పార్టీలకు చెందిన పేద ప్రజలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఈ ప్రభుత్వం ఖచ్చితంగా మా సమస్యలు తీరుస్తుందనే అచంచల విశ్వాసం ప్రజల్లో కనిపించిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు.. ఏవైనా సరే ఓటరు స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



మల్యాల, మే 9(నినాదం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం కొండగట్టులో మంగళవారం అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ పెరిగింది. కోనేరులో పుణ్య స్నానమాచరించి అనంతరం క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. క్షేత్రపాలకుడైన శ్రీ బేతల స్వామిని సైతం దర్శించుకున్నారు. వేసవి సెలవులు సమీపిస్తున్న వేళ సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో అంజన రెడ్డి ,ఏఈవో హరిహర నాథ్, సూపరింటెండెంట్ల చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్ ,శ్రీనివాస్ ,అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.




## రెండు రోజుల నష్టాలకు బ్రేక్

### చివరి గంటలో కొనుగోళ్ల జోరు



గడిచిన రెండు సెషన్లుగా ఇన్వెస్టర్లను కలవరపెట్టిన నష్టాల పరంపరకు మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా బ్యాంకింగ్ రంగంలో వ్యూహాత్మక కొనుగోళ్లు మార్కెట్లకు ఊరటనిచ్చాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 394 పాయింట్లు పుంజుకొని 73,918.76 మార్కు వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 119 పాయింట్లు లాభపడి 23,242.10 వద్ద ముగిసింది. మధ్యాహ్నం సమయంలో కొంత లాభాల స్వీకరణ జరిగినప్పటికీ చివరి గంటలో కొనుగోలుదారులు ఆసక్తి చూపడంతో సూచీలు తిరిగి పుంజుకున్నాయి.

**మార్కెట్ జోష్‌కు దారితీసిన కారణాలు**

నేటి మార్కెట్ గమనాన్ని విశ్లేషిస్తే ఈ రికవరీకి ప్రధానంగా కొన్ని అంశాలు దోహదపడ్డాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అందులో..

**ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల తగ్గింపు**

పశ్చిమాసియాలో కొన్ని రోజులుగా తీవ్ర రూపం దాల్చిన ఇరాన్–ఇజ్రాయెల్ ఘర్షణలు సద్దుమణుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు పరస్పర దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో భయాలను తొలగించింది.

**క్రూడాయిల్ ధరలు**

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 0.71% తగ్గి బ్యారెల్‌కు 92.75 డాలర్ల వద్దకు చేరింది. భారత దేశం వంటి దిగుమతులపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థకు చమురు ధరలు తగ్గడం ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించి మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది.

**ఆర్‌బీఐ బూస్టర్ డోస్.. బ్యాంకింగ్ రంగం హవా**

నేటి మార్కెట్ ర్యాలీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం బూస్ట్‌గా మారింది. విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు గాను బ్యాంకులు సేకరించే తాజా ఎఫ్‌సీఎన్ఆర్–బీ డిపాజిట్ల కోసం యూఎస్ డాలర్–రూపాయి ఫారెక్స్ స్వాప్ సదుపాయాన్ని ఆర్‌బీఐ ప్రవేశపెట్టింది. కనీసం 3 సంవత్సరాల నుంచి గరిష్టంగా 5 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లకు ఇది వర్తిస్తుంది.
ఈ నిర్ణయంతో నిఫ్టీ బ్యాంక్ ఏకంగా 1,255 పాయింట్లు దూసుకెళ్లింది. ఏప్రిల్ 10 తర్వాత బ్యాంక్ నిఫ్టీ సాధించిన అత్యుత్తమ సింగిల్–డే లాభం ఇదే కావడం గమనార్హం. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి హెవీ వెయిట్ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి.

**అంతర్జాతీయ మార్కెట్ల మద్దతు**

గత వారం అమెరికా వాల్ స్ట్రీట్‌లో చోటుచేసుకున్న అమ్మకాల ఒత్తిడి నుంచి అంతర్జాతీయ మార్కెట్లు వేగంగా కోలుకున్నాయి. ఆసియా మార్కెట్లలో సెమికండక్టర్, టెక్నాలజీ షేర్లు రాణించాయి.

## గ్లోబల్ హెల్త్ హబ్‌గా భారత్

### $130 బిలియన్ల ఫార్మా మార్కెట్ లక్ష్యం

**హైదరాబాద్ బ్యూరో జూన్ 9 (నినాదం )**

నాణ్యత, అందుబాటు ధరలు, విశ్వసనీయ సరఫరా వ్యవస్థతో భారతదేశం నేడు ప్రపంచ ఔషధాల కేంద్రంగా (ఫార్మసీ అఫ్ ది వరల్డ్ ) ఎదిగిందని నిపుణులు పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో దేశీయ ఫార్మా పరిశ్రమ విలువ 20 బిలియన్ డాలర్ల నుంచి 60 బిలియన్ డాలర్లకు పెరిగింది. కోవిడ్–19 సమయంలోనూ, ప్రపంచ సంక్షోభాల వేళలోనూ భారత్ నిరంతరాయంగా ఔషధాలు, వ్యాక్సిన్లు సరఫరా చేస్తూ అంతర్జాతీయ విశ్వసనీయత‌ను చాటుకుంది. భారత ఔషధ ఎగుమతులు 2015లో 14 బిలియన్ డాలర్ల నుంచి 2026 నాటికి 31 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రపంచ జనరిక్ మందుల డిమాండ్‌లో 20 శాతం వాటాతో భారత్ 200కు పైగా దేశాలకు ఔషధాలను ఎగుమతి చేస్తోంది. అమెరికా సహా అనేక అభివృద్ధి చెందిన దేశాలు భారత ఫార్మా ఉత్పత్తులపై ఆధారపడుతున్నాయి. జనరిక్ మందులతో పాటు బయోసిమిలర్స్, జీన్ థెరపీలు, వ్యాక్సిన్లు, మెడికల్ డివైసెస్ రంగాల్లోనూ భారత్ వేగంగా ముందుకు సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బయోఫార్మా శక్తి వంటి కార్యక్రమాలు పరిశోధన, ఆవిష్కరణలకు ఊతమిస్తున్నాయి. ఈ క్రమంలో 2030 నాటికి భారత ఫార్మా రంగం 130 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను, 50 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేస్తోంది.



## 2030 నాటికి 10 లక్షల మందికి ఏఐ నైపుణ్య శిక్షణ: సేల్స్‌ఫోర్స్

**హైదరాబాద్ బ్యూరో జూన్ 9 (నినాదం)**

ప్రముఖ ఏఐ సీఆర్ఎం సంస్థ 2030 నాటికి దేశవ్యాప్తంగా 10 లక్షల మంది అభ్యాసకులకు ఏఐ–కేంద్రీకృత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ప్రకటించింది. సేల్స్‌ఫోర్స్ ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. ట్రైల్‌హెడ్ డిజిటల్ లెర్నింగ్ వేదిక ద్వారా విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. ఇందులో ఏఐ నైపుణ్య శిక్షణ, వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు, అకడమిక్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ వంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ సందర్భంగా అరుంధతి బట్టచర్య మాట్లాడుతూ, భారత యువతను ఏఐ ఆధారిత భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేయడమే లక్ష్యమని తెలిపారు. పరిశ్రమ–విద్యాసంస్థల భాగస్వామ్యంతో విద్యార్థులకు డిజిటల్, క్లౌడ్, డేటా, ఏఐ రంగాల్లో ప్రాయోగిక నైపుణ్యాలు అందించనున్నట్లు వెల్లడించారు.



## చమురు దిగుమతిని తగ్గించే వ్యూహం

# ‘ఈ85 ఫ్లెక్స్ ఇంధనం’

భారత ఇంధన రంగంలో స్వావలంబన సాధించడమే లక్ష్యంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ‘ఈ85 ఫ్లెక్స్ ఇంధనం’ను అధికారికంగా విడుదల చేసింది. ఈ సరికొత్త ఇంధనంలో 80 నుంచి 85 శాతం ఇథనాల్, కేవలం 15 నుంచి 20 శాతం మాత్రమే పెట్రోల్ (మోటార్ గ్యాసోలిన్) ఉంటాయి. మారుతి సుజుకి సంస్థ దేశంలోనే మొట్టమొదటి ఫ్లెక్స్–ఫ్యూయల్ కారును ఆవిష్కరించిన సందర్భంగా.. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఈ ప్రకటన చేశారు. ఈ చొరవతో దేశంలో ఇథనాల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ మరింత పెరగనుంది.

**తొలిదశలో 50 నుంచి 100 ఇంధన స్టేషన్లు**

ప్రారంభ దశలో భాగంగా దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, పుణె, నాగ్‌పూర్ పరిధిలోని 50 నుంచి 100 రిటైల్ అవుట్‌లెట్లలో ఈ ఇథనాల్ పంపిణీ స్టేషన్లను ప్రారంభించనున్నారు. దేశంలోనే అత్యధిక వాహన జనాభా, ఇంధన వినియోగం ఉన్న ఈ నగరాలను పైలట్ ప్రాజెక్ట్ కోసం వ్యూహాత్మకంగా ఎంపిక చేశారు. దీనివల్ల వినియోగదారులకు ఫ్లెక్స్–ఫ్యూయల్ వాహనాలపై అవగాహన, విశ్వసనీయత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఫ్లెక్స్-ఇంధన స్టేషన్ల విస్తరణ ఇలా..**

ప్రస్తుత ప్రారంభం : 50 – 100 స్టేషన్లు
2026 చివరి నాటికి : 500 స్టేషన్లు
2027 చివరి నాటికి : 5,000 స్టేషన్లు

**రూ.1.84 లక్షల కోట్లు ఆదా!**

గడిచిన దశాబ్ద కాలంలో ఇథనాల్ బ్లెండింగ్ (మిశ్రమం) రంగంలో భారత్ ప్రగతి సాధించింది. 2014లో కేవలం 1.5 శాతంగా




ఉన్న ఇథనాల్ మిశ్రమం.. నేడు ఏకంగా 20 శాతానికి చేరింది. ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు కంటే ముందే ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. ఈ బ్లెండింగ్ కార్యక్రమం ద్వారా దాదాపు 302 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు దిగుమతులు తగ్గాయి. విదేశీ మారక ద్రవ్యంలో ఏకంగా రూ.1.84 లక్షల కోట్లు ఆదా అయ్యాయి.

**సరఫరా గొలుసు ముప్పునకు బ్రేక్**

‘భారతదేశం ప్రస్తుతం శిలాజ ఇంధనాల దిగుమతి కోసం ఏటా 120 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇది మన కరెంట్ ఖాతాపై భారాన్ని మోపుతోంది.
పైగా మన దేశానికి వచ్చే ఎల్పీజీలో 60 శాతం, ముడి చమురులో 90 శాతం హార్ముజ్ జలసంధి గుండానే ప్రయాణించాల్సి వస్తోంది.
ఈ నేపథ్యంలో దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్‌తో (E100) నడిచే వాహనాలను ప్రోత్సహించక తప్పదు’ అని హర్దీప్ సింగ్ పురి అన్నారు.

**అసలు ఏమిటీ ఈ-85 ఇంధనం?**

ఈ–85 అనేది సాధారణ పెట్రోల్ కాదు. ఇది 85 శాతం ఇథనాల్, 15 శాతం సంప్రదాయ పెట్రోల్ కలయికతో తయారైన ఒక మిశ్రమ బయో–ఇంధనం. ముడి చమురు దిగుమతులపై విదేశీ భారాన్ని తగ్గించడం, వాహన కాలుష్యాన్ని నియంత్రించడం దీని ప్రధాన ఉద్దేశం. పెట్రోలియం కంపెనీల తయారీ వ్యయం తగ్గడం వల్ల సాధారణ పెట్రోల్ కంటే ఇది లీటరుకు దాదాపు రూ.20 రూపాయల తక్కువ ధరకు లభిస్తుంది.




## 20 వేల మంది రిక్రూట్మెంట్ వాయిదా వేసిన ఇన్ఫోసిస్

దేశంలోని టాప్ టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ తన రిక్రూట్మెంట్ ప్రక్రియలో ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, నిజాయితీకి పెద్దపీట వేసే ఈ సంస్థ.. సుమారు 20వేల మందికి పైగా అభ్యర్థులకు నిర్వహించాల్సిన ఆన్‌లైన్ పరీక్షలు, ఇన్–పర్సన్ ఇంటర్వ్యూలను తాత్కాలికంగా వాయిదా వేసింది. కొందరు అభ్యర్థులు అక్రమాలకు పాల్పడినట్లు, ఒకరి స్థానంలో మరొకరు పరీక్షలు రాసినట్లు గుర్తించడమే దీనికి ప్రధాన కారణం. ముఖ్యంగా స్పెషలిస్ట్ ప్రోగ్రామర్ ట్రైనీ, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులపై ఈ ప్రభావం పడింది.
రిక్రూట్మెంట్ ప్రాసెస్ లో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశ్యంతో ఇన్ఫోసిస్ తన భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేసింది. పరీక్షల నిర్వహణలో కొత్త రూల్స్, అదనపు సేఫ్టీ చర్యలను ప్రవేశపెట్టింది. ఈ మార్పుల కారణంగానే షెడ్యూల్ చేసిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు, కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని సంస్థ అభ్యర్థులకు ఇమెయిల్స్ ద్వారా సమాచారం అందించింది. అయితే ఈ తాత్కాలిక వాయిదా వల్ల కంపెనీ భవిష్యత్తు రిక్రూట్మెంట్ ప్లాన్స్ లో ఎలాంటి మార్పు ఉండదని, ప్రతిభావంతులైన యువతను రిక్రూట్ చేసుకోవాలనే కట్టుబడి ఉన్నామని కంపెనీ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇన్ఫోసిస్ తన రిక్రూట్మెంట్ అండ్ ట్రైనింగ్ కోసం ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ అనే డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగిస్తోంది. ఈ ప్లాట్‌ఫారమ్ ప్రస్తుతం ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిపి దాదాపు 15 మిలియన్ల మంది వినియోగదారులతో దూసుకుపోతోంది. గతంలో పూర్తిగా ఆన్‌లైన్ పద్ధతిలో నియామకాలు చేపట్టిన ఇన్ఫోసిస్.. నకిలీ ప్రొఫైల్స్, సాంకేతిక సమస్యల కారణంగా గత ఏడాది నుండి ఆన్‌లైన్ అండ్ ఆఫ్‌లైన్ తో కూడిన హైబ్రిడ్ మోడల్‌ను అమలు చేస్తోంది. టాలెంట్ నిరూపించుకోలేని వారి విషయంలో సంస్థ కఠినంగా వ్యవహరిస్తోంది. గత ఏడాది మైసూర్ క్యాంపస్‌లో అంతర్గత పరీక్షల్లో 3 సార్లు ఫెయిల్ అయిన 600 మంది ట్రైనీలను కంపెనీ ఇంటికి పంపిన సంగతి తెలిసిందే.

# కౌలు రైతు ఆత్మహత్య

## కౌలు పొలం వద్దే ఆత్మహత్య

### పంట దిగుబడి తగ్గిందని, పెట్టుబడి అప్పులు తీర్చేది ఎలా...? అని బెంగతో..



**జగిత్యాల, జూన్ 9:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన మానాల పెద్ద దుబ్బయ్య (60) అనే కౌలు రైతు (దళిత రైతు) ఆత్మహత్య చేసుకొని బలవన్మరణం చెందారు. కుటుంబ సభ్యులు, బుగ్గారం ఎస్సై జి. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మానాల పెద్ద దుబ్బయ్య ( 60 ) అనే దళిత రైతు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవి స్తుంటారు. బుగ్గారం గ్రామానికి చెందిన పలువురు రైతుల భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక, పంట దిగుబడి తగ్గి పోయి అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధలతో సతమతం అవుతున్న ఆయన ఈ ఏడాది వరి పంట దిగుబడి చాలా తక్కువగా వచ్చిందని, పంట పెట్టుబడి బాకీలు, భూ యజమానులకు కౌలు డబ్బులు ముట్టే పరిస్థితి లేదని బెంగ పెట్టుకున్నారు. గత నాలుగైదు రోజులుగా తీవ్ర మనస్థాపంతో నీరసంగా ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జగిత్యాలకు పోయి వస్తానని ఇంట్లో వాళ్లకు చెప్పి ఇంటి నుండి బయలు దేరి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం రాత్రి అతని ఆచూకీ కోసం కుటుంబీకులు వెతికినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం ఉదయం బుగ్గారం శివారు, చందయ్యపల్లి రోడ్డులో అతను కౌలుకు చేసిన పంట పొలాల సమీపంలోనే విగత జీవిగా శవమై కనిపించాడు. వెంటనే బుగ్గారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జి.సతీష్ ఆ స్థలానికి చేరుకొని శవాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ సభ్యులను, బంధువులను, గ్రామస్తులను విచారించారు. మృతుడి కుమారుడు మానాల లక్ష్మి నారాయణ పిర్యాదు మేరకు వ్యవసాయం ద్వారా వచ్చిన నష్టాలతో అప్పులు పేరుకుపోయాయని, మనస్థాపం చెంది ఎవరికీ చెప్పకుండా మానాల పెద్ద దుబ్బయ్య కౌలు చేసిన పొలాల వద్దకు వచ్చి విష పదార్థశీ సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు పిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. పోలీసులు శవ పంచనామ నిర్వహిం చారు. జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం శవాన్ని తరలించారు. పోస్టు మార్టం అనంతరం లాంఛనాల ప్రకారం బుగ్గారంలో మానాల పెద్ద దుబ్బయ్య కు "అంతిమ యాత్ర" నిర్వహించి అంత్య క్రియలు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన రైతు మానాల పెద్ద దుబ్బయ్య కు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్ళు, మనుమలు, మనుమరాండ్లు ఉన్నారు.

### చొప్పదండిలో ప్రతి గ్రామానికి

# బస్సు సౌకర్యం కల్పించాలి

ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం



**కరీంనగర్, జూన్ 9(నినాదం):** కరీంనగర్‌లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ బి. రాజుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ప్రాంతీయ అధికారి భూపతి రెడ్డి, డిపో మేనేజర్ విజయ మాధురి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం అందేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కెనాల్‌ల వద్ద ప్రమాద నివారణ కోసం అల్యూమినియం. భద్రతా గోడలు నిర్మించాలని, నిలిచిపోయిన మోడల్ పాఠశాల బస్సులు, రాత్రి బస్సు సేవలను పునరుద్ధరించాలని ప్రతిపా దించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సు నిలయాలు ఏర్పాటు చేయడంతో పాటు, బస్సు స్టేషన్లు, నిలయాల్లో తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలు, కళాశాలల సమయాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా బస్సులు నడపాలని కోరారు. అలాగే జగిత్యాల, పెగడపల్లి, జగిత్యాల, వేములవాడ, జగిత్యాల, కరీంనగర్, కరీంనగర్ ,గంగాధర, కరీంనగర్, బావుపేట, కరీంనగర్, గోపాల్‌రావుపేట, ముప్పడిపల్లి, కరీంనగర్, కొదురుపాక, దేశాయిపల్లి, కరీంనగర్,కత్నపల్లి, వేములవాడ, కరీంనగర్, వేములవాడ,గంగాధర, కరీంనగర్, విలాసాగర్, గౌరాపురం,నర్సింహులపల్లి తదితర మొత్తం 14 కొత్త మార్గాల్లో బస్సు సేవలు ప్రారంభించాలని ప్రతిపాదించారు.

### సాదాబైనామా దరఖాస్తుల

# పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

చొప్పదండి, గంగాధర తహసీల్దార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ

పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష కలెక్టర్ చిత్ర మిశ్రా



**కరీంనగర్, జూన్ 9(నినాదం):** పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖా స్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టర్ చొప్పదండి, గంగాధర తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించి, సంబంధిత దస్త్రాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. సీసీఎల్ఏ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులు, భూ రికార్డులు, అనుబంధ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిశీల న, ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, పెండింగ్ కేసుల కు ప్రాధా న్యత ఇవ్వాలని ఆదేశించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అనుకూలమైన, స్నేహపూర్వక వాతావరణంలో సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం చేపట్టి, ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ డీ సూపరింటెండెంట్ మోబిన్, చొప్పదండి, గంగాధర తహసీల్దార్లు నవీన్ కుమార్, రజిత తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి బీజేపీ ఆగ్రహం



**మెట్ పల్లి జూన్ 9: ( నినాదం):** పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మెట్ పల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు ధోనీకెల నవీన్ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం ముందు ఆగ్రహ ధర్నా నిర్వహించారు. ధోనీకెల నవీన్ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. మార్కెట్ పనులు నిలిచిపోవడం వల్ల రైతులు, వ్యాపారస్తులు రహదారులపై కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. దీంతో రోడ్డు ట్రాఫిక్ సమస్యలు పెరిగాయి, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కానీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారు? అసాంఘిక కార్యక్రమాలు సమీకృత మార్కెట్ ప్రారంభానికి అడ్డుగా మారుతున్నాయని గమనించాలి" అని అన్నారు. ధర్నా కార్యక్రమంలో బీజేపీ నేతలు మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించి, నిలిచిపోయిన పనులను తక్షణమే ప్రారంభించి సమీకృత కూరగాయల మార్కెట్ ప్రారంభం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన నాయకుల్లో ధర్మపురి సరూప వేణుగోపాల్, బొడ్ల ఆనంద్, కోయల్కర్ స్రవంతి, లింగేశ్వర్, వసుధ నాగేష్, కలికోట శ్రీకాంత్, బత్తుల జగదీష్, మిట్టపల్లి కృష్ణమూర్తి, కొయ్యల లక్ష్మణ్, సుంకే అశోక్, నరసయ్య బొడ్ల, అనిల్ గుండవేని, శేఖర్, భాస్కర్ భోగ దత్తు, జగన్ గుండు, కాదాసు శ్రీనివాస్, ప్రభాకర్ దండిక, పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ కఠిన ఆదేశాలు





**మెట్‌పల్లి, జూన్ 9 ( నినాదం):** మెట్‌పల్లి మున్సిపాలి టీలో అభివృద్ధి పనుల వేగం, నిధుల వినియోగం, సానిటేషన్, సంక్షేమ చెల్లింపులపై అదనపు కలెక్టర్ బీ. రాజా గౌడ్ మంగళవారం కఠిన సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు కాలువవలు శుభ్రం చేయడం, భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ, పెండింగ్ చేయూత పెన్షన్ల లైవ్ అథెంటికేషన్ పూర్తి చేయాలని ఆయన స్పష్ట ఆదేశాలు ఇచ్చారు.

**సమీక్షలో ముఖ్య సూచనలు : ఇంజనీరింగ్ విభాగం** కేంద్ర, రాష్ట్ర నిధులను ఏ జాప్యం లేకుండా వినియోగించాలి. అభివృద్ధి పనులు సమయానికి పూర్తి చేయాలి. కలువలు శుభ్రత రానున్న వర్షాకాలం దృష్ట్యా మురుగు కాలువలు ముందుగానే శుభ్రం చేయాలి. చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించాలి. భవన అనుమతులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. చేయూత పెన్షన్లు లైవ్ అథెంటికేషన్ పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల వివరాలను స్థానిక కౌన్సిలర్ల సహకారంతో వెంటనే పూర్తి చేయాలి. ప్రతి విభాగం సమయపాలనతో, బాధ్యతాయుతంగా పనిచేయి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలన్న సూచన ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ సహా అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జూన్ 13న 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమం

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రతకు బండి సంజయ్ పిలుపు



**కరీంనగర్, జూన్ 9(నినాదం):** కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 13న 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా, మండల అధ్యక్షులతో కలిసి కార్యక్రమాలపై ఆయన చర్చించారు. జూన్ 15 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూన్ 10న మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రతి పాఠశాలకు బాధ్యులను నియమించాలని సూచించారు. జూన్ 11, 12 తేదీల్లో గ్రామాల్లో 'టిఫిన్ సమావేశాలు' నిర్వహించి, జూన్ 13న పాఠశాలల తరగతి గదులు, ప్రాంగణాలను శుభ్రపరిచే కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే జూన్ 16న 'మీ పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి' అనే నినాదంతో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 'మోదీ కానుక'గా ఉచిత బ్రాండెడ్ సైకిళ్లు అందజేయనున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. ఈసారి అన్ని పాఠశాలల్లో ఒకే సమయంలో వేలాది సైకిళ్ల పంపిణీ చేపట్టి

# రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఇంట్లో చోరీ

–లాకర్‌ను ఎత్తుకెళ్లిన అగంతకులు



**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 9 (నినాదం) :** నిజామాబాద్ నగరంలో భారీ చోరీ జరిగింది. సుభాష్ నగర్ లోని రిటైర్డ్ అదనపు కలెక్టర్ రవికుమార్ ఇంట్లో దొంగలు పడ్డారు. జేసీ రవికుమార్ ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లగా సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు బైక్ పై దర్జాగా వచ్చి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని బెడ్ రూంలో అంతా గాలించారు. లాకర్ ను ఎత్తుకెళ్లారు. అ ఇంట్లో ఉన్న సీసీ కెమెరా డివిఆర్ ను సైతం ఎత్తుకెళ్ళారు. ముందు రెక్కీ నిర్వహించి పక్కా ప్లాన్ ప్రకారం చోరీ చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లాకర్ లో దాదాపు 30 తులాల బంగారం, నగదు ఉన్నట్లు సమాచారం. భారీ చోరీ జరిగిన విషయం మంగళవారం ఉదయం ఇరుగుపొరుగు వారు తెలుపడంతో వెలుగులోకి వచ్చింది. ఘటన స్థలాన్ని పోలీసులు చేరుకుని విచారణ ప్రారంభించారు. క్లూస్ టీం ఆధ్వర్యంలో అనవాళ్లు, వేలిముద్రలను సేకరించారు.

## కౌలు రైతు ఆత్మహత్య



**బుగ్గారం, జూన్ 9 (నినాదం ):** బుగ్గారం మండల కేంద్రానికి చెందిన మానాల దుబ్బయ్య (60) అనే కౌలు రైతు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే, బుగ్గారం మండల కేంద్రానికి చెందిన మానాల దుబ్బయ్య వ్యవసాయ పనుల కోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం ఆయన మృతి చెందినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న రైతులు మృతదేహాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుగ్గారం మండల ఎస్ఐ సతీష్ తెలిపారు.

### నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న

## కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ఆర్ఎస్‌పి ఫిర్యాదు




**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 9 (నినాదం) :** నిజామాబాద్ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కల్లు బట్టీలపై చర్యలు తీసుకోవాలని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ( ఆర్ ఎస్ పి)ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ పి జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో అనేక ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కల్లు దుకాణాలు ,కల్లుడిపోలో నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘిస్తూ కొన్ని కల్లు డిపోలో అధిక మత్తు పదార్థాలు కలిపి విక్రయిస్తున్నారనిఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి డిపోలపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగావిద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలు, దేవాలయాలు , ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలకు సమీపంలో ఉన్నకల్లు దుకాణాలు వెంటనే తొలగించాలని కోరారు. మద్యం ,మత్తు పదార్థాల వినియోగం యువత పై తీవ్ర ప్రభావం చూపుతోందని, సమాజంలో అనేకసామాజిక సమస్యలకు కారణమవుతోంది ఆందోళన వ్యక్తం చేశారు. నిజామాబాద్ నగరాన్ని మత్తుపదార్థాల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించేవ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్ల.నరేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట వాసికి దక్కిన అరుదైన గౌరవం

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా చందా రాజు



జమ్మికుంట, జూన్ 9 (నినాదం) జమ్మికుంట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ముద్దుబిడ్డ చందా రాజు కు అరుదైన గౌరవం దక్కింది. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ మంగళవారం హైదరాబాదులో చందా రాజుకు నియామక పత్రం అందజేశారు. గతంలో ఆర్యవైశ్య మహాసభ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించిన చందా రాజు ను రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా నియమించడం పట్ల జమ్మికుంట పట్టణ ఆర్యవైశ్య కుల బాంధవులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చందా రాజు మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం నిరంతర పాటుపడతానని రాబోయే ఆర్యవైశ్య మహాసభ స్థానిక ఎన్నికల్లో సంఘం అభివృద్ధి కోసం పనిచేసే నాయకులను ఎన్నుకొని సంఘం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. కష్టాల్లో ఉన్న ఆర్యవైశ్యులకు ఆర్యవైశ్య మహాసభ అండగా ఉంటుందని తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడికి వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా నన్ను నియమించడం పట్ల నాపై మరింత బాధ్యత పెరిగిందని నిష్పక్షపాతంగా సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. త్వరలో జమ్మికుంట మండల ఆర్యవైశ్య మహాసభ కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని ఎన్నికల కన్వీనర్ గా బాదం రమేష్ బాబు నియమించడం జరిగిందని కో కన్వీనర్ గా అయితే రాఘవేంద్ర వ్యవహరిస్తారని తెలిపారు. మండల పరిధిలోని సభ్యత్వం లేని ఆర్యవైశ్యులు ఎవరైనా ఉంటే సభ్యత్వం తీసుకోవాలన్నారు.

# సవాల్‌గా మారిన సైబర్ క్రైమ్

అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

ఏసీపీ కార్యాలయంలో మొక్కలు నాటిన సిపి గౌష్ అలం






**జమ్మికుంట, జూన్ 9 (నినాదం):** కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న సైబర్ క్రైమ్స్ పోలీసులకు సవాల్‌గా మారాయని ప్రతి ఒక్క సవాల్ ని ఛాలెంజ్‌గా తీసుకొని పరిష్కరించడం జరుగుతుందని కరీంనగర్ సిపి గౌస్ అలాం అన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని ఏసిపి కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్లో ఉన్న కేసుల వివరాలతో పాటు సైబర్ క్రైమ్‌కు సంబంధించిన నేరాలపై సిపి ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి గౌస్ అలం మాట్లాడుతూ జిల్లాలోని బ్యాంకులు జువెలర్స్ షాప్ ల వద్ద సెక్యూరిటీ పెంచాలని సూచించారు. అదేవిధంగా ప్రతినెల హోటల్లు లాడ్జిల యజమానుల నుంచి రిపోర్ట్స్ తీసుకుంటామని జిల్లాలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారి పూర్తి వివరాలు సేకరించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రతి పాఠశాలలో షి కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని అదేవిధంగా సైబర్ క్రైమ్ పైన ప్రతి ఒక్కరు అవగాహన కలిగేలా ప్రజలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో సైబర్ క్రైమ్ పెద్ద ఛాలెంజ్ గా ఉంటుందని డబ్బులు పోయిన గోల్డెన్ అవర్ లోనే బాధితులు 1930 కి కంప్లైంట్ చేయాలని ఇలా చేయడం వల్ల కొంతమేరకు వారి డబ్బులు రికవరీ చేసే అవకాశాలు ఉంటాయని సూచించారు. హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలలో సైబర్ క్రైమ్ కు సంబంధించిన అవగాహన పెంచాలన్నారు. సబ్ డివిజన్ పోలీసుల పనితీరు బేష్‌లిహుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసులను సిపి గౌస్ అలం అభినందించారు. మంగళవారం హుజురాబాద్ ఏసిపి కార్యాలయాన్ని సందర్శించిన సిపి సబ్ డివిజన్ పోలీసులు పనితీరు రికార్డుల నిర్వహణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసిపి మాధవి ఇన్స్పెక్టర్లు కరుణాకర్ రామకృష్ణ గౌడ్ వెంకట్ శ్రీనివాస్ ఎస్ఐలు స్వాతి ఆవుల తిరుపతి తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ బోనాల్లో సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జూన్ 9(నినాదం) :** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని దుర్షేడ్‌లో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మంగళవారం పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం బోనాల్లో పాల్గొన్న భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కృపతో రానున్న వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలన్నారు.

## కల్తీ సుగంధ ద్రవ్యాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

47 బస్తాల కారంపొడి సహా భారీ నిల్వల స్వాధీనం..

నమూనాలు పరీక్షలకు పంపిన ఆహార భద్రత అధికారులు



**కరీంనగర్, జూన్ 9(నినాదం):** నగరంలోని శనివారం మార్కెట్ పరిధిలో కల్తీ కారంపొడి విక్రయాలపై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గౌరిశెట్టి రమేష్, సిద్ధంశెట్టి చక్రపాణికి చెందిన కిరాణా, సుగంధ ద్రవ్యాల దుకాణాల్లో నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో కల్తీ అనుమానిత నిల్వలు గుర్తించారు. సమాచారం అందుకున్న ఆహార భద్రత అధికారులు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. వారి సమక్షంలో 50 కిలోల చొప్పున ఉన్న 47 బస్తాల కారంపొడి, రెండు బస్తాల పసుపు పొడి, ఒక బస్తా ధనియాల పొడిని స్వాధీనం చేసుకుని ఆహార భద్రత శాఖకు అప్పగించారు. దుకాణాల నుంచి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపిన అధికారులు, నివేదికలు వచ్చే వరకు మొత్తం నిల్వను సీజ్ చేసి విక్రయాలపై నిషేధం విధించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ ఆహార పదార్థాల వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్, ఎస్ఐలు మామిడాల సురేందర్, శ్రీకాంత్, కానిస్టేబుల్ సాయిదీప్

### ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్

## నారాయణరెడ్డి బదిలీ

ఇంచార్జ్ సూపరిండెంట్‌గా డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి



**జమ్మికుంట, జూన్ 9 (నినాదం):** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన మహబూబ్నగర్ జిల్లా పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీపై వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. డాక్టర్ నారాయణరెడ్డి బదిలీపై వెళ్లగా ప్రస్తుతం హుజురాబాద్ ఏరియా హాస్పిటల్ ఇన్చార్జి సూపర్డెంట్ గా సీనియర్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి కి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. పూర్తిస్థాయి సూపరిండెంట్ ను నియమించే వరకు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి వైద్య సేవలకు ఆటంకం లేకుండా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు విధులు నిర్వహిస్తారని తెలుస్తుంది.

## తప్పుడు సర్వే నెంబర్లతో ప్లాట్ రిజిస్ట్రేషన్

లోన్ తిరస్కరించడంతో బట్టబయలైన నిజం

బాధితుడి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు

**జమ్మికుంట, జూన్ 9 (నినాదం):** దొంగ సర్వే నెంబర్లు సృష్టించి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయునికి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయగా సదరు ఉపాధ్యాయుడు లోన్ కోసం వెళ్లగా దొంగ సర్వేనెంబర్ అని తెలియడంతో నలుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మికుంట మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దొడ్డే దుర్గాప్రసాద్ జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం లో గల ఒక వెంచర్ లో 59 వ నెంబర్ గల ప్లాటు కొనుగోలు చేశాడు. డాక్యుమెంట్ లేఅవుట్ కు సంబంధించిన సర్వే నెంబర్లు 94 ,95, 100 కాకుండా లే అవుట్ కు సంబంధంలేని సర్వే నెంబర్ 103 లో జతపరిచి కోనారెడ్డి, రాఘవరెడ్డి, గర్రెపల్లి అరుణ్ కుమార్, టి రాజేశ్వరరావు రిజిస్ట్రేషన్ చేశారు. లే అవుట్ కు సంబంధించిన ప్రొసీజర్ ను పరిశీలించగా నూట మూడు లేదు. ఫిర్యాదిదారుడు లోనుకు వెళ్ళగా లేఔట్ కు సంబంధంలేని సర్వే నెంబర్ ఉందని తిరస్కరించడంతో ప్లాట్ విక్రయించిన వారి వద్దకు వెళ్లి తెలుపగా సవరణ చేయాలంటూ కాలయాపన చేస్తున్నారు. దీనితో మానసికంగా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలపడంతో కేసు నమోదు చేసినట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

# సంక్షేమ హాస్టల్స్, పాఠశాలలో మరమ్మతులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, జూన్ 9 (నినాదం):** పాఠశాలల పునః ప్రారంభంలోపే పాఠశాలలు, హాస్టళ్లలో చిన్న చిన్న మరమ్మతులు పూర్తిచేసి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, అనుముల మండలం కేంద్రం హాలియాలో పలు విద్యాసంస్థలను, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు . ముందుగా నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేసి సిహెచ్ సి ప్రారంభోత్సవానికి అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది తదితర విషయాలపై జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృతో చర్చించారు. వైద్య పరికరాల నిమిత్తం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 65 లక్షల రూపాయల మంజూరు చేసిన విషయాన్ని డాక్టర్ మాతృ వివరించారు. సాధ్యమైనంత త్వరగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కేజీబీవీని తనిఖీ చేసి కేజీబీవీలో టాయిలెట్లు, తాగునీటి వసతి వంటివి సిద్ధం చేయాలని, పాఠశాల ప్రారంభం నాటికి చిన్నచిన్న రిపేర్ పనులన్ని పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్రావును ఆదేశించారు. ఎస్ సి గర్ల్స్ హాస్టల్లో మరమ్మత్తు పనులు పరిశీలించారు. కాగా హాస్టల్లో నీరు నిలువ ఉండడాన్ని గమనించిన మున్సిపల్ కమిషనర్ ను పిలిపించి నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే సోక్ పిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీసీ బాలికల వసతి గృహంలో ఉన్న సౌకర్యాలు ,స్టోర్ రూమ్, డార్మెటరీని తనిఖీ చేశారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా పాఠశాల ఆవరణలో చేపట్టిన తాగునీటి ట్యాంకు నిర్మాణం మధ్యలో ఆగిపోగా జిల్లా కలెక్టర్ స్పందించి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ పిలిపించి తక్షణమే వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డిగ్రీ కళాశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు, టీఎస్ ఎం ఐ డి సి డిప్యూటీ ఇంజనీర్ శైలజ తదితరులు ఉన్నారు.

# ఉత్తమ్ దంపతులపై నిరాధార ఆరోపణలు

## డీఎస్పీకి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



**కోదాడ, జూన్ 9 (నినాదం):** రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన నిరాధార ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, పిల్లుట్ల శ్రీనివాస్ మంగళవారం కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హుజూర్నగర్, కోదాడ నియోజకవర్గాల్లో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతుండగా రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అవినీతి ఆరోపణలకు ఆధారాలు ఉంటే సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేయాలని, లేకుంటే ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేయరాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆధారాలు లేకుండా ఎవరిపైనా ఆరోపణలు చేయరాదని, పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో మైలారిశెట్టి భాస్కర్, పాలడుగు సంజీవ్, షరీఫ్, బాగ్దాద్, కామల్ల ప్రవీణ్, పిడతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ నక్ష సర్వే త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ దేవరాజ్



**మిర్యాలగూడ, జూన్ 9 (నినాదం):** మిర్యాలగూడ మున్సిపాలిటీలో నక్షా సర్వే వేగవంతం చేయాలని, జులై నాటికి పూర్తి చేయాలని ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ నల్లగొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పి.దేవరాజ్ కోరారు. మంగళవారం మునిసిపల్ మీటింగ్ హాలులో మునిసిపల్, రెవిన్యూ, ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నక్షా సర్వే 10 మున్సిపాలిటీలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారని, అందులో మిర్యాలగూడ మున్సిపాలిటీ ఒకటన్నారు. ఇందులో భాగంగా ఇళ్లు, భవనాలు, ఖాళీ స్థలాల మ్యాపింగ్ కోసం 32 వార్డులను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయి పరిశీలన కోసం 356 బ్లాకులు, 43వ్యవసాయ బ్లాకులు, 313 భవనాల బ్లాకులుగా విభజించి సర్వే పనులు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. మున్సిపాలిటీలో 25,000 ఆస్తులను గుర్తించి, నిరంతర శ్రమతో 9,375 ఆస్తుల డిజిటల్ సర్వే చేసి 37 శాతం ప్రగతి సాధించామన్నారు. సర్వే నిర్వహణకు 5 టీంలు, మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు 14ప్రత్యేక టాస్క్ ఫోర్స్ రంగంలో ఉన్నాయన్నారు. నక్షా సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలని మునిసిపల్ కమీషనర్ నర్రా శ్రీజారెడ్డి అన్నారు. తాసిల్దార్ పి. శ్రీనివాస్ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.

# గర్భిణీలకు ఉచితంగా ప్రత్యేక వైద్య సేవలు



**కాటారం, జూన్ 09(నినాదం):** ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక పిహెచ్ సిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్సీ డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీలకు ప్రత్యేక వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలకు పోషకాహారం, ఐరన్-ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, ల్యాబ్ టెక్నీషియన్ పుష్పలత, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, వసంత, లత, లలిత, సమ్మక్క, సంధ్యతో పాటు గర్భిణీలు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు పంపిణీకి సిద్ధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు

## ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ జూన్ 9 (నినాదం):** గతంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులన్నీ సంపూర్ణంగా పూర్తయ్యాయి. త్వరలోనే రాష్ట్ర మంత్రుల సమక్షంలో అర్హులైన లబ్దిదారులకు ఈ ఇళ్లను అధికారికంగా పంపిణీ చేస్తామని మిర్యాలగూడ సాహసం సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్ గృహ కల్ప పథకం కింద మంజూరైనా ఈ స్థలంలోగత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ఇళ్ల నిర్మాణం పేరుతో 10 ఏళ్లలో మూడుసార్లు ప్రత్యేక నిధులను మంజూరు చేయించి కూడా పనులు పూర్తిచేయకుండా ఈ ఇళ్ళను పేదలకు చూపించి రాజకీయం చేసే ప్రయత్నాలు చేశారు అని అన్నారు. ఎన్నికల ముందు కనీసం త్రాగు నీరు, రోడ్డు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఓట్ల కోసం డ్రా సిస్టమ్ పెట్టి ప్రజలను మభ్యపెట్టారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం 6 నెలలుగా నిత్యం పర్యవేక్షిస్తూ, మంత్రులు, అధికారుల సహకారంతో ఇక్కడ నివసించడానికి కావాల్సిన మౌలిక వసతులను ప్రత్యేక నిధుల ద్వారా పూర్తి చేయడం జరిగింది. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని మౌలిక వసతుల పనులను అధికారులు నాణ్యతతో పూర్తి చేశారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ , కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్ గారు, జాతీయ మాలమహానాడు అధ్యక్షులు తాళ్లపల్లి రవి , సర్పంచ్ బెజ్జం సైదులు , స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పాల్వాయి గోవర్ధనరెడ్డి వర్ధంతి వేడుకలు



**మునుగోడు, జూన్ 9 (నినాదం):** మాజీ రాజ్యసభ సభ్యుడు,మాజీ ఎమ్మెల్సీ,మాజీ ఎమ్మెల్యే పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా, మంగళవారం మునుగోడు నియోజకవర్గం. చండూరు మున్సిపాలిటి కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, మాజీ ఎంపీపీ తోకల వెంకన్న పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ, ప్రజా సేవకు అంకితమైన నాయకుడిగా పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తోకల వెంకన్న మాట్లాడుతూ, దేశ రాజకీయాలను శాసించిన గొప్ప వ్యక్తి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి అని అన్నారు. ఒక ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా ప్రజలకు ఎనలేని సేవలు చేశారని ఆయన తెలిపారు. చండూరు కి ప్రభుత్వ కార్యాలయాలు రావడానికి, అభివృద్ధి పనులు జరగడానికి ఆయనే ముఖ్య కారకుడని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మారగోని అంజయ్య గౌడ్, మేకల శ్రీనివాస్ రెడ్డి, జిట్టాగోని మల్లేష్, గురిజ సునిల్, చండూరు మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మధ్యాహ్నం భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



**అమరచింత, జూన్ 9, (నినాదం):** అమరచింత మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరచింత మండలం లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్స్ మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వర్కర్స్ 3000 గౌరవ వేతనంతో అగౌరవమైన జీవితం కొనసాగిస్తున్నారని మన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా వంట కార్మికులకు పదివేల రూపాయలు తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదు. అంతేకాదు మొన్న కార్మికులకు పెంచిన జీతాలలో మధ్యాహ్న భోజన వర్కర్స్ కు ఎలాంటి వేతనం పెరగలేదు కావున మధ్యాహ్న భోజన వర్కర్స్ కి వేతనాలు పెంచాలని కోరడం జరిగింది మార్కెట్‌లో కోడి గుడ్డు ధరలు విపరీతంగా పెరగడం వల్ల గుడ్డును వడ్డించడం సాధ్యం కావడం లేదు అందుకని ప్రభుత్వం కోడిగుడ్డును ప్రభుత్వమే సర్ఫరాజ్ చేయాలి. గ్యాస్ సిలిండర్లు ఉచితంగా కనెక్షన్ తో పాటు ఇచ్చినప్పటికీ అవి మొదటి నెల కు మాత్రమే పరిమితమైనవి గ్యాస్ ధరలు విపరీతంగా విరిగిన కారణంగా గ్యాస్ బండతో వంట చేయడం లేదు. వంట చెరుకు ద్వారానే వంట చేస్తున్నారు కాబట్టి గ్యాస్ ఉచితంగా సప్లై చేయాలి కార్మికులకు ప్రత్యేకమైన దుస్తులు ఇవ్వాలి పిఎఫ్ సౌకర్యం కల్పించాలి. బీమా సౌకర్యం కల్పించాలి నెల నెల బిల్లులు ఇవ్వాలి వంట పాత్రలో నిర్మించాలి కార్మికులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చేందుకు ఎంఈఓ కార్యాలయానికి వెళ్ళగా ఎంఈఓ అందుబాటులో లేకపోవడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ సుజాత సంధ్య భారతమ్మ నిర్మల పద్మ పావని గోవిందమ్మ పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

## బిషప్ దుర్గం ప్రభాకర్



**సూర్యాపేట ప్రతినిధి జూన్ 9 (నినాదం):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ జాతీయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె జి బాలకృష్ణన్ కు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ సోమవారం న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్లో వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులు మతం మారినప్పటికీ సామాజికంగా ఆర్థికంగా వెనుకబాటతనంలో ఉన్నారని అన్నారు .దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం ద్వారా విద్యా ఉపాధి సంక్షేమ పథకాలలో సమాన అవకాశాలు లభిస్తాయి అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు.

# రైతు కష్టానికి దక్కేది రోజుకు రూ.50 మాత్రమే!

## రైతు ఆదాయంపై ఆందోళన

**కాటారం, జూన్ 9 (నినాదం):** వ్యవసాయమే దేశానికి వెన్నెముక అని చెబుతున్నప్పటికీ రైతు పరిస్థితి మాత్రం రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. ఒక ఎకరా వరి సాగుకు సుమారు 180 రోజులపాటు శ్రమించి, 60 సంచుల దిగుబడి సాధించిన రైతుకు అన్ని ఖర్చులు తీసేస్తే చివరకు మిగిలేది రోజుకు కేవలం రూ.50 మాత్రమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరా పంటకు 60 సంచుల దిగుబడి వచ్చినా, క్వింటాల్‌కు లభిస్తున్న ధరల ప్రకారం మొత్తం ఆదాయం రూ.37,900 వరకు మాత్రమే వస్తోంది. దున్నడం, విత్తనాలు, నాట్లు, కలుపు, ఎరువులు, మందులు, హార్వెస్టర్, రవాణా, కూలీల ఖర్చులతో కలిపి సుమారు రూ.28,900 వరకు వ్యయం అవుతోంది. దీంతో మొత్తం ఆదాయంలో నుంచి ఖర్చులు తీసివేస్తే రైతుకు రూ.9,000 మాత్రమే మిగులుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మొత్తాన్ని పంట సాగు కాలమైన 180 రోజులపై విభజిస్తే రోజుకు రూ.50 మాత్రమే వస్తుండటంతో రైతు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించి, సాగు ఖర్చులను తగ్గించే చర్యలు చేపట్టాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కాంగ్రెస్ కుట్రలను ఓడిద్దాం.. సింగరేణిని కాపాడుకుందాం

## 137 ఏండ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కొత్తగా నిబంధనలు
## 12న హరీష్ రావు సభను విజయవంతం చేద్దాం
## మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**భూపాలపల్లి, జూన్ 9 (నినాదం):** సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను కుట్రలను ఓడిద్దాం.. సింగరేణిని కాపాడుకుందాం కార్మిక లోకం ఏకం కావాలి అంటూ భూపాలపల్లి సింగరేణి ఏరియా కెటికె -1 ఇంక్లైన్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తెలంగాణ సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు,పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్మికులు తదితరులు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు బానిసలు అవుదామా లేదా వారి అక్రమాలపై తిరగబడదామ నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది. కొంతమంది మమ్మల్ని అంటున్నారు మీరు గుర్తింపు సంఘం నాయకులుకారు మీకు ఎటువంటి బాధ్యత లేదు అని, మరీ ఈ గుర్తింపు సంఘాలు కార్మికుల పక్షాన మాట్లాడనప్పుడు, వాళ్ళ హక్కులను పరిరక్షణకై మా మీద గురుతరమైన బాధ్యత ఉంది. సింగరేణి ఇన్వాలిడేషన్ ఒక్క సమస్య అయితే, అసలు సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. నేటి ప్రభుత్వంలో కార్మికుల జీతాలు ఇవ్వడం కొరకు ఏ బ్యాంకు ఓడి ఇస్తదా అని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కనపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బిల్స్ ఇవ్వకపోగా దాదాపు 55 వేల కోట్ల రూపాయలు సింగరేణి సంస్థకు బాకీ పడ్డది. దీని వల్ల సింగరేణి సంస్థ దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది. కేసీఆర్ నాయకత్వంలో బొగ్గు టెండర్లు ఎటువంటి రాజకీయా ప్రమేయం లేకుండా నిర్వహించడం జరిగింది. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల అంశంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. సింగరేణిలో సుమారు 13 వేల మంది కార్మిక కుటుంబాలకు సంబంధించిన వారసత్వ ఉద్యోగాల మెడికల్ అన్‌ఫిట్ అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గండ్ర ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా మొండిచేయి చూపడం సరికాదని అన్నారు. భూపాలపల్లి అభివృద్ధి అంతా గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేకంగా చేసిన అభివృద్ధి ఏదీ కనిపించడం లేదని ఆయన విమర్శించారు. భూపాలపల్లిని జిల్లాగా ఏర్పాటు చేయడం, మెడికల్ కాలేజీ మంజూరు చేయడం వంటి కీలక నిర్ణయాలు గత ప్రభుత్వంలోనే తీసుకున్నట్లు గుర్తుచేశారు. సింగరేణి కార్మికులకు అవసరమైన వసతులు ఎక్కడ లేని విదంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ వంటి సంక్షేమ కార్యక్రమాలు గత ప్రభుత్వంలో అమలు చేశామని పేర్కొన్నారు. కాబట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి పనితీరు ఎలా ఉందో ఒక్కసారి ఆలోచన చేయాలి. అదే విధంగా ఈ నెల 12వ తేదీన మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే హరీష్ రావు భూపాలపల్లి బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి విచ్చేస్తున్నా నేపథ్యంలో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఎన్నికల సామాగ్రి భద్రత పటిష్టంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 9(నినాదం):** ఎన్నికల సామాగ్రి భద్రత పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి ఫ్యాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు మరియు వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్లను తనిఖీ చేసి, ఎన్నికల సంగం సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత మరియు నిష్పాక్షికత కోసం ఈవిఎంల, వివి ఫ్యాట్ ల భద్రత అత్యంత కీలకమని ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయనున్నామని తెలిపారు. గోదాంలో ఉన్న అన్ని యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తాళం వేసి సీల్ వేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు...

## జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జూన్ 9(నినాదం):** విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జూనియర్ కాలేజీపై మంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాఘవ



**అమరచింత, జూన్ 9, (నినాదం):** అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తానని గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారని హామీ ఇచ్చిన దాత మంత్రి అయ్యి ఇచ్చిన హామీని విస్మరించారని ఎస్ ఎఫ్ ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు కే. రాఘవ ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం అమరచింతలో ఆయన మాట్లాడుతూ అమరచింత మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు చదువుల కోసం సుందర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది పేద విద్యార్థులు సుందర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతూ ఆర్థిక భారంతో మధ్యలో చదువుని మానేస్తున్నారని అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో అన్నీ ఉండి అల్లుడి నోట్లో శని అని తీరులో జూనియర్ కళాశాల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు మండల పరిధిలో ఏడు ప్రభుత్వ ఉన్నంత పాఠశాలలో ఉండగా ప్రతి సంవత్సరం దాదాపు 600 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదివిందుకోసం మహబూబ్నగర్ వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణాలకు వెళుతున్నారు చాలామంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలో చదువులు ఆపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అమరచింత మండలంలో జూనియర్ కాలేజీ లేకపోవడం దారుణమని అన్నారు విద్యార్థుల ఇబ్బందుల గురించి ప్రభుత్వం స్పందించి జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐఐ వనపర్తి జిల్లా నాయకులు రమేష్ మండల నాయకులు సంజ,య్,రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే నాణ్యమైన విద్య

- పిన్నంచర్లలో అడ్మిషన్ల కోసం ప్రచారం చేపట్టిన లెక్చరర్స్



**అమరచింత, జూన్ 9, (నినాదం):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ కురుమూర్తి అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సైదులు ఆదేశాల మేరకు సోమవారం కళాశాల అధ్యాపకులు మండలంలోని పిన్నంచెర్ల గ్రామంలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా లెక్చరర్ కురుమూర్తి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఈ సంవత్సరం అనేక సౌకర్యాలు కల్పించిందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం మధ్యాహ్న భోజనం, రాగి జావా, పాలు, పుస్తకాలు, నోట్ బుక్కులు, బెల్టు, ఐడి కార్డులు పంపిణీ చేస్తున్నమని తెలిపారు. అదనంగా ఈసారి నీట్, ఎంసెట్ కోచింగ్ లు ఆన్లైన్ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఉంటుందన్నారు. అడ్మిషన్ల కోసం వెళ్ళినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అపూర్వ స్పందన వస్తుందని లెక్చరర్ కురుమూర్తి తెలిపారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి

**ఎరువులు, విత్తనాలపై అధిక ధరలు వసూలు చేయరాదు: కలెక్టర్ భవేశ్ మిశ్రా**





**నిర్మల్ ప్రతినిధి, జూన్9 (నినాదం):** సోమవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని బాలకిషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణం లోని ఎరువులు విత్తనాల స్టాక్, క్రయ విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్ లలోని వివరా లను ఆన్లైన్ వివరాలతో సరిపోల్చారు. క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డుల న్నీ పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో తేడాలు ఉండరాదన్నారు. పలు కంపెనీల విత్తనాల లేబుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు లకు ఎట్టి పరిస్థి తుల్లో నకిలీ విత్తనాలను అమ్మరాదని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని అన్నారు. రైతుల నుంచి విత్తనాలు, ఎరువులకు నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదని చెప్పారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీవి అమ్మినా, అధిక ధరకు అమ్మినా కఠిన చర్యలు ఉంటా యని హెచ్చరించారు. అంతకుముందు డిసిఎం ఎస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతు లకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అంది వ్వాలని అన్నారు.ఈ తనిఖీలలో జిల్లా వ్యవసా య అధికారి అంజి ప్రసాద్, తహసిల్దార్ సంతో ష్, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల అధి కారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదాల నిలయంగా మారిన స్నానాల ఘట్టాలు

**అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం**



**నిర్మల్ ప్రతినిధి/బాసర, జూన్9 (నినాదం):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమీపంలో మంగళవారం ఘోర విషాదం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చి, గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్లిన ఒకే కుటుంబానికి చెంది న ముగ్గురు అన్నదమ్ములు ప్రమా దవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు. ఈ ఘటనతో బాసర క్షేత్రానికి వచ్చిన భక్తులతో పాటు స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. స్థానికులు, పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరా బాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాం తానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం రైలులో బాసరకు చేరుకు న్నారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే ముందు సాంప్రదాయం ప్రకారం పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించేందుకు కుటుంబ సమేతంగా నది రేవుకు వెళ్లారు. అక్కడ నీటిలోకి దిగిన సమయంలో నదిలో ఉన్న లోతును, నీటి ప్రవాహ వేగాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోయారు. ప్రమాదవశాత్తు లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేష్ కుమార్ (31) అనే ముగ్గురు సోదరులు ఒక్కసారిగా నీటిలో మునిగిపోయారు. ప్రవాహ ఉధృతికి వారు కొట్టుకుపోతుండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆందోళనతో గట్టిగా కేకలు వేశారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న బాసర పోలీసులు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విపత్తు నిర్వ హణ బృందాలు మరియు స్థానిక గజ ఈతగాళ్లను రంగంలోకి దించారు. నదీ తీర ప్రాంతాల్లో బోట్ల సహాయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. కళ్లెదుటే ముగ్గురు కొడుకులు నదిలో కొట్టుకుపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం అక్కడ ఉన్న ఎవరి వల్లా కాలేదు.

**అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న భక్తులు**

బాసర లోని గోదావరి స్నానాల ఘట్టం ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారిందని భక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడ పదుల సంఖ్యలో భక్తులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నా, అధికారులు కంటితుడుపు చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని మండిపడుతున్నారు. నదిలో ఏ ప్రాంతం లోతుగా ఉంది? ఎటువైపు వెళ్లకూడదు? అనే విషయాలపై సరైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడమే ఈ తరచుగా జరిగే ప్రమాదాలకు ముఖ్య కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. గతంలో జరిగిన ఇసుక తవ్వకాల వల్ల నది గర్భంలో భారీ గుంతలు ఏర్పడ్డాయని, దూరం ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఈ భౌగోళిక పరిస్థితులపై ఎలాంటి అవగాహన ఉండదని పేర్కొంటున్నారు. కనీసం ఘాట్ల వద్ద రక్షణ జాలీలు (ప్రొటెక్షన్ నెట్స్) ఏర్పాటు చేయకపోవడం, నిరంతరం పర్యవేక్షించే లైఫ్ గార్డులను అందుబాటులో ఉంచకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ కమిటీ స్పందించి నది వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, లేదంటే రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాణాలు బలికాక తప్పదని భక్తులు హెచ్చరిస్తున్నారు. కాగా, గల్లంతైన ముగ్గురు యువకుల కోసం నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పటికీ గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# ఎరువుల కొనుగోలుపై వెంటనే రసీదు ఇవ్వాలి

**మండల వ్యవసాయ అధికారి ఈ. పైడితల్లి...**

**కాట్నపల్లిలో మండల ఫర్టి లైజర్స్ డీలర్లు, సొసైటీ సీఈఓలతో సమావేశం**



**సుల్తానాబాద్, జూన్9 (నినాదం):** ఎరువుల కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి ఈ. పైడితల్లి ఫర్టిలైజర్స్ డీలర్లు, సొసైటీ సీఈఓ ల కు సూచించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవ సాయ అధికారి ఈ. పైడితల్లి ఆ ధ్వర్యంలో మండలంలోని ఫెర్టిలైజర్ డీలర్స్, సొ సైటీ సీఈవో లతో సమావేశం జరిగింది. ఈ స మావేశంలో పైడితల్లి మాట్లాడుతూ,ప్రతి డీలర్ విత్తనాలు, ఎరువులు పురుగు మందుల లైసెన్సు కాపీలను, స్టాక్ బోర్డును విధిగా షాప్ వద్ద ప్రద ర్శించవలెనని,ఎరువులు కొనుగోలు చేసే రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. ఈ వానాకాలం సాగుకు సరిపడ నాణ్యమైన విత్త నా లు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. గత సంవత్సరం లాగానే ఈ సీజన్ కూడా ఫెర్టిలై జర్ బుకింగ్ అప్ లో యూరియా బుక్ చేసుకున్న రైతులకు మాత్రమేయూరియా అందజేయాలని, తర్వాత స్టాక్ రిజిస్టర్లో ఎంట్రీ చేసి రసీదు ఇవ్వాలి సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ పద్మ ఫెర్టిలైజర్ డీలర్స్, సొసైటీ సీఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐలో ప్రవేశాల గడువు పొడగింపు

**మంచిర్యాల, జూన్9 (నినాదం):** మంచిర్యాల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ (ఐటిఐ)లో ప్రవేశాలకు ఈనెల 30 వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 27 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడ్ లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేయాలని సూచించారు. పూర్తి వివరాలు కోసం కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

# సిర్పూర్‌లో పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

**ఇంచార్జి పీసీసీఎఫ్‌ను కోరిన ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు**



**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూన్9 (నినాదం) :** సిర్పూర్ నియోజకవర్గంలోని పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు అటవీ శాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) వినయ్ కుమార్‌ను కోరారు. హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో మంగళవారం ఇంచార్జి పీసీసీఎఫ్‌ను కలిసిన ఎమ్మెల్యే పోడు రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చింతలమానేపల్లి మండలం దిందా, కర్జెల్లి, బెజ్జూర్ మండలంలోని పాపన్‌పేట, పెంచికల్పేట్ మండలంలోని దరోగపల్లి తదితర గ్రామాల్లో అటవీ అధికారులు పోడు రైతులపై ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోడు భూముల స్వాధీన ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు. అర్హులైన పోడు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఇంచార్జి పీసీసీఎఫ్ వినయ్ కుమార్, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీఎఫ్ఓకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, ఉప సర్పంచ్ దుబ్బుల మురళి, సత్తుతే తుకారాం, చౌదరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా

**సిసి రోడ్డు సైడ్ ర్యాంపులు తీశారు వదిలేశారు**

**కానరాని అధికారుల పర్యవేక్షణ**





**సుల్తానాబాద్, జూన్9 (నినాదం):** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు సుగ్గంపల్లి రాజీవ్ రహదారి నుండి శ్రీరాములపల్లి రోడ్డు విస్తరణ లో భాగంగా సిసి రోడ్ సైడ్ ర్యాంపు లు తీసి వదిలేశారని, ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అని ఒకటవ వార్డు మాజీ కౌన్సిలర్ పసిడ్ల మమత సంపత్ , ప్రజలు సంబంధిత అధికారు లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విస్తరణ పనులు హడావిడిగా ఆగమేఘాలమీద ప్రారంభించి, సిసి రోడ్డుకు ఇరువైపుల చెట్లను తొలగించి మూడు నెలలు గడుస్తున్న పనులు పూర్తిగాక మధ్యలో నిలిపివేయడంతో ప్రజలు, వాహనదారులు ప్రమా ద బారిన పడుతున్నారని సంబంధితఅధికారు లు పర్యవేక్షణ కొరవడిన కారణంగా ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలిచిందని ఇటూ వైపు కన్నెత్తి వారే లేరని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామ దేవత పోచమ్మ తల్లి బోనాలు పండగ 17, 18, 19 తేదీన శ్రీరాములపల్లి, సుగ్గాంపల్లి లోనిర్వహిస్తు న్నారని,మహిళలు పోచమ్మ బోనాలతోఅధిక సం ఖ్యలో పాల్గొంటారని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులని ఎవరని, దీనిపై ఎవరు సమాధానం చె పుతారని, నిత్యం ఈ మార్గంపై వెళ్తున్న ప్రయాణికులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోచ మ్మ బోనాలు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికై నా అధికారులు దీనిపై వెంటనే స్పందించి సదరు కాంట్రాక్టర్ తో పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

**రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి..**

**మాజీ కౌన్సిలర్ పసిడ్ల మమత సంపత్**



ఈనెల 17 ,18, 19 తేదీన గ్రామ దేవత పోచమ్మ బోనాలను పురస్కరించుకొని రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని, బోనాల పండగ సంద ర్భంగా శ్రీరాములపల్లి, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారని అన్నారు. నిత్యం ఈ మార్గంలో శ్రీరాములపల్లి ప్రజలు, వాహనదారులు వె ళ్తుంటారని, అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరి గితే ఎవరు బాధ్యత వహిస్తారని, దీనిపై సమాధా నం చెపుతారని డిమాండ్ చేశారు. పోచమ్మ బో నాల లోపు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.

# సీఎం రేవంత్ రెడ్డికి బిజెపి భయం పట్టుకుంది: రావుల రామనాథ్



**నిర్మల్ ప్రతినిధి, జూన్9 (నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ భయం పట్టుకుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ఆరోపించారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ పార్టీని, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమై కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని అన్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుందని, తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు చేయబోమని కేంద్రం ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యానికి కేంద్రాన్ని బాధ్యులను చేయడం తగదని పేర్కొన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన "రైతు గోస- బీజేపీ భరోసా యాత్ర" ప్రభావంతోనే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై మహేశ్వర్ రెడ్డి నిరంతరం పోరాటం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని, రాష్ట్రం ఎవరి జాగీరు కాదని వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవడంతో బీజేపీపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఫామ్‌హౌస్‌కే పరిమితం చేసినట్లే, రాబోయే ఎన్నికల్లో సీఎం అనుముల రేవంత్ రెడ్డిని కొడంగల్‌కే పరిమితం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, నాయకులు ముత్యం రెడ్డి, రాచకొండ సాగర్, పొన్నం నారాయణ గౌడ్, జుట్టు దినేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# న్యూ లోలం ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**ఎంపీడీవో, సర్పంచ్**



**నిర్మల్ ప్రతినిధి/దిలావర్ పూర్, జూన్9 (నినాదం):** దిలావర్ పూర్ మండలంలోని న్యూ లోలం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) వర్క్ సైట్ వద్ద కూలీలకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీల సౌకర్యార్థం సర్పంచ్ శ్రీలత, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) అరుణ రాణిలు, ఎంపీ ఓ గోవర్ధన్ ఉమ్మ డిగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి కూలీలకు మజ్జిగ అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల కు వచ్చే కూలీలు ఎండల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) గోవర్ధన్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఏపీఓ) దివ్య రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) మహేష్, మరియు పంచాయతీ కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే ఉలికెందుకు

**హరీష్ రావుపై వ్యాఖ్యలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే దాసరి**

**6 గ్యారంటీల హామీ ఏమైంది.. ఇచ్చింది కాదు.. ఎగ్గొట్టింది చెప్పాలి**



**పెద్దపల్లి రూరల్, జూన్9 (నినాదం):** ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధా నాలను ప్రశ్నిస్తే ఉలిక్కిపడాల్సిన అవసరం లేదని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత టి.హరీష్ రావు పెద్దపల్లి పర్య టన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల పక్షాన ప్రశ్నిం చగా,స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన ఆరోపించారు.ఆచరణలో అమలు కాని అనేక హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా హామీలను తప్పించుకుంటోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం జరుగుతోందని,రూ.80,500 కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం పెద్ద జోక్ అని ఆయన వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అనేక జిల్లాలకు సాగునీరు అందుతూ పంట దిగుబడులు పెరిగాయని తెలిపారు. 2014-15లో 68.17 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి ఉండగా,2023-24 నాటికి సుమారు 260 లక్షల టన్నులకు పెరిగిందని ఆయన వివరించారు.రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎగనామం పెట్టే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని,సోలార్ పంపుసెట్ల పేరుతో రైతులను తప్పుదోవ పట్టిస్తు న్నారని ఆయన విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రీపెయిడ్ మోటార్ల అంశం ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సోలార్ పంపుసెట్లు అంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ. 2,500, కల్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయలు,తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు,ఆసరా పెన్షన్ రూ.4,000,రైతు బీమా,రైతు భరోసా వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయకుండా తప్పించుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు.100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు 1000 రోజులకు దగ్గరపడుతున్నా అమలు దిశగా చర్యలు లేవని విమర్శించారు.గత ఐదున్నర నెలలుగా రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో మరణించిన రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందడం లేదని ఆయన ఆరోపించారు.ఈ విషయాన్ని ప్రశ్నిస్తే ఇందిరమ్మ బీమా పథకం గురించి చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాల ద్వారా గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు ఎంతో మేలు జరిగిందని ఆయన తెలిపారు. ఈ సీజన్‌లో పెద్దపల్లి నియోజకవర్గంలో అధిక తూకం లేకుండా ధాన్యం కొనుగోలు జరిగిందా అని ప్రశ్నించారు.మిల్లర్లు ట్రక్ షీట్లు మార్చి రైతులకు అన్యాయం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.ప్రతిపక్షంగా ప్రజల సమస్యలను ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు స్పందించకుండా తొందరపాటుతో వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన అన్నారు.ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం తగదని హెచ్చరించారు. హరీష్ రావు ఇరిగేషన్,వైద్య ఆరోగ్య,ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. అలాంటి నాయకుడిపై అసత్య ఆరోపణలు చేయడం తగదని,వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.లేకపోతే ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని దాసరి మనోహర్ రెడ్డి హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్,గర్రెపల్లి పిఎసిఎస్ చైర్మన్ సందీప్ రావు,కాల్వ శ్రీరాంపూర్ మాజీ జెడ్పిటిసి వంగాల తిరుపతిరెడ్డి,ఎలిగేడు మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్ రావు,మున్సిపల్ కౌన్సిలర్ సుజాత రవీందర్, నాయకులు మార్కు లక్ష్మణ్,సలేంద్ర రాములు, ముత్యాల రాజయ్య, తీగల సదయ్య,కొయ్యడ సతీష్ గౌడ్, పెంచాల శ్రీధర్,పూదరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# డాక్టర్ దామర రాములుకి ఘన సన్మానం

**వైద్యం అట్టడుగు వర్గాలకు చేరాలి**



**నిర్మల్ ప్రతినిధి, జూన్ 9 (నినాదం):** నిర్మల్ పట్టణంలోని ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త డాక్టర్ దామెర రాములు కి ఘన సన్మానం జరిగింది. ఇటీవల ఆయన "అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా" (API) తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మల్ నర్సింగ్ హోమ్‌లోని 'దామెర సాహితీ క్షేత్రం'లో తెలంగాణ రచయితల వేదిక (తెరవే) నిర్మల్ జిల్లా శాఖ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA), డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సన్మాన వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణంరాజు, తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు ప్రసంగించారు. వక్తలు తమ ప్రసంగాలలో డాక్టర్ దామెర రాములు గత నాలుగు దశాబ్దాలుగా నిర్మల్ ప్రాంతంలో అందిస్తున్న నిరంతర వైద్య సేవలను, అలాగే తెలుగు సాహిత్య రంగానికి ఆయన చేస్తున్న విశేష కృషిని ఘనంగా కొనియాడారు. సన్మాన అనంతరం డాక్టర్ దామెర రాములు గారు మాట్లాడుతూ, శాస్త్రీయమైన ఆధునిక వైద్యం సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరే వరకు వైద్యులు సామాజిక సేవా దృక్పథంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైద్య సేవలను మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేలా ప్రజల్లో అవగాహన కల్పించడానికి తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ వేడుకలో ఐఎంఏ నిర్మల్ అధ్యక్షులు డాక్టర్ కె. మురళీధర్, మానస సాహితీ సంస్థ అధ్యక్షులు డాక్టర్ తుమ్మల దేవరావు, యువ కవి పురస్కార గ్రహీత పోలీస్ భీమేష్, నిత్య కవి అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, తెరవే ఈసీ సభ్యులు కుమ్మరి నాగారం తదితర ప్రముఖులు పాల్గొని డాక్టర్ రాములు గారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## ముప్పై రోజుల్లో... నిజాంపేట

# డంపింగ్ యార్డ్ తరలింపు

### ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన సమస్యకు శాశ్వత పరిష్కారం

### రూ.20 కోట్లతో ఎస్సీ హాస్టల్ నిర్మాణం: సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 9 ( నినాదం):** వేలాది మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, స్థానిక కాలనీవాసులు, భవిష్యత్తులో ఇక్కడ విద్యన భ్యసించనున్న గురుకుల విద్యార్థులకు ఇబ్బందిగా మారిన నిజాంపేట డంపింగ్ యార్డును 30 రోజుల్లోగా తరలిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.మంగళవారం బాచుపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డిగ్రీ కళాశాల నూతన భవన ప్రాంగణం సమీపంలోని డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, ఈ ప్రాంతంలో కొన్ని నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా డంపింగ్ యార్డు తరలింపు అత్యవసరమైందని అన్నారు.

ఈ ప్రాంతంలో రూ.20 కోట్ల వ్యయంతో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం ఆధునిక హాస్టల్ నిర్మంచామని తెలిపారు. త్వరలో గురుకుల విద్యార్థులు ఇక్కడికి రానున్న నేపథ్యంలో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.కాలనీవాసులు తమ సమస్యలను వివరించగా బాధ కలిగిందని, గతంలో చిన్నారిపై కుక్కల దాడి జరిగిన ఘటన ఎంతో విషాదకరమని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు పరిసరాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయన్న ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు.

డీసీపీతో మాట్లాడి ప్రత్యేక పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేయాలని సూచిస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.గతంలో డంపింగ్ యార్డు తరలింపుపై కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు అందాయని, ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు ప్రక్రియ కారణంగా కొంత ఆలస్యమైందని చెప్పారు. అయితే ప్రస్తుతం అన్ని శాఖల సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టి నెల రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వెల్లడించారు.

"గురుకుల విద్యార్థుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన పరిసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పునరుద్ఘాటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థ భవన నిర్మాణం పూర్తయిందని, అయితే డంపింగ్ యార్డు ముందునుంచే ఉండటంతో విద్యార్థులు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించామని, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసి డంపింగ్ యార్డును త్వరితగతిన తరలిస్తామని చెప్పారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు

# సమన్వయంతో కృషి చేయాలి

### ఇండస్ట్రియల్ హబ్‌గా వెలుగొందుతున్న జిల్లా అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలి



- రైతులను క్రాప్ డైవర్షన్, ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలి
- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి
- గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ విద్య వైపు ప్రోత్సహించాలి
- ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య మౌలిక వసతులు కల్పించాలి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర కార్మిక, ఎంప్లాయిమెంట్ శాఖ మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు.**

**- సంగారెడ్డి బ్యూరో, జూన్ 9 (నినాదం)**

తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రవాణా, ఆర్ అండ్ బి, పిసిబి, పి ఆర్, విద్యుత్, డి ఆర్ డి ఏ, సంక్షేమ శాఖలు, ఆర్టీసీ, షుగర్ కేన్, పరిశ్రమలు, తదితర రంగాల పురోగతిపై మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లా మరింత పురోగతి సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని



సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహిస్తూ, లాభదాయక పంట అయిన ఆయిల్ పామ్ సాగుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని, రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, గూడు లేని పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో గతంలో నిర్మించి కేటాయించని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, తాగునీటి సమస్యలు ఎక్కడా తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల మేరకు నీటి నిల్వలను నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన మౌలిక వసతులపై నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. జాతీయ రహదారి–65 పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ కార్మికుల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చూడాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. హాస్పిటళ్లు, హోటళ్లు తదితర సంస్థల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా చేరడం ముఖ్యమని అన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన బోర్‌వెల్స్ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని డయాగ్నస్టిక్ పరికరాలు, డ్రగ్స్, అవసరమైన ఇక్విప్‌మెంట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ సేవలకు అవసరమైన చోట అదనపు పడకల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నర్సింగ్ కళాశాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నర్సింగ్ వృత్తికి ప్రస్తుతం దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉన్నందున గ్రామీణ ప్రాంతాల యువతులను నర్సింగ్ కోర్సులు అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి 35 కిలో మీటర్ల పరిధిలో ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన డ్రైవర్ల నియామకాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎంపీలు , ఎమ్మెల్సీ, శాసనసభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కంచిరావుపల్లి నుంచి అంతర్జాతీయ స్థాయికి.. జగదీష్ రెడ్డి మరో ఘనత



**పెబ్బేరు, జూన్ 09 (నినాదం):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామానికి చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయి క్రికెట్ కోచ్ కె.జగదీష్ రెడ్డి మరో అరుదైన ఘనత సాధించారు. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 (టీజీ 20) లీగ్‌లోని మెదక్ ఫాల్కన్స్ జట్టుకు హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. కె.నరసింహా రెడ్డి కుమారుడైన జగదీష్ రెడ్డి ఐసీసీ (ఐసీసీ) లెవల్–3 కోచ్‌గా గుర్తింపు పొందారు. గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగిన ఆయన క్రమశిక్షణ, అంకిత భావం, నిరంతర శ్రమతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కోచ్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం స్టార్ ఆటగాళ్లతో కూడిన మెదక్ ఫాల్కన్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం వనపర్తి జిల్లా క్రీడా రంగానికి గర్వకారణంగా మారింది. ఇటీవల నిర్వహించిన టీజీ20 ఆటగాళ్ల వేలంలో భారత జట్టు స్టార్ క్రికెటర్ తిలక్ వర్మను మెదక్ ఫాల్కన్స్ జట్టు రూ.33 లక్షల రికార్డు ధరకు దక్కించుకుంది. టీజీ20 లీగ్ చరిత్రలోనే అత్యధిక ధరకు ఎంపికైన ఆటగాడిగా తిలక్ వర్మ నిలిచారు. అలాగే ప్రముఖ క్రికెటర్ రవితేజ కూడా ఈ జట్టులో స్థానం సంపాదించారు. గ్రామీణ ప్రాంతాల యువత లక్ష్యసాధన కోసం కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని జగదీష్ రెడ్డి తన విజయాలతో నిరూపించారని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన సాధించిన ఈ ఘనతతో కంచిరావుపల్లి గ్రామంతో పాటు పెబ్బేరు మండలం, వనపర్తి జిల్లా పేరు రాష్ట్రవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం పొందింది.

NINADAM CINEMA

## దేశ విభజన ఆధారంగా ..

# బట్వారా 1947

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటి వరకు 'లాహోర్ 1947' అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షుటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా 'బట్వారా 1947' గా మారుస్తూ చిత్రబృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్య్ర దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యా



ప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్ కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టను మిస్టర్ పర్ఫెక్ట ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సరమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# విడుదలకు రెడీ అవుతున్న లెనిన్

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటరట◌ైనర 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఊరమాస్ గ్రామీణ ప్రేమకథా చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. టీజర్, సాంగ్స్ రిలీజ్ అయ్యాక ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ–రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ సర్కిల్స్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ క్లోజ్ అయినట్లు టాక. రాయలసీమ మినహాయించి మిగిలిన ఆంధ్ర రీజియన్ థియేట్రికల్ హక్కులు దాదాపు రూ. 9 కోట్ల రేషియోలో క్లోజ్ అయింది. అఖిల్ గత చిత్రం ఏజెంట్ బిగ్గెస్ట్ డిజాస్టరా అయినా కూడా 'లెనిన్' సబ్జెక్ట మరియు ప్రోమోస్ లోని మాస్ అప్పీల్ చూసి బయ్యర్లు ఈ స్థాయి మొత్తాన్ని పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో అఖిల్ సరికొత్త రఫ్ అండ్ రస్టిక లుకలో కనిపిస్తుండగా, ఆయనకు జోడీగా క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. థమన్ అందిస్తున్న మ్యూజిక సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. ఈ సినిమాతో అఖిల్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కంబ్యాక ఇవ్వడం ఖాయమని అక్కినేని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఆంధ్ర ఏరియాలోనే 9 కోట్ల రేషియోలో బిజినెస్ కదా రాయలసీమ మంచి రేట్ వచ్చే అవకాశం ఉంది. ఇక నైజాంలో అన్నపూర్ణ సొంత డిస్ట్రిబ్యూషన్ పైనే రిలీజ్ చేసే అవకాశం ఉంది.



## కన్నీరు పెట్టుకున్న

# మంజరి ఫడ్నిస్

తన అపార్ట్‌మెంట్‌లో ఉండే ఓ కుక్కను విచక్షణారహితంగా కొట్టి చంపేశారంటూ నటి మంజరి ఫడ్నిస్ ఆవేదన వ్యక్తంచేశారు. 2019లో తమ సొసైటీలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ కుక్కని వదిలివెళ్లారని అప్పటి నుంచి దాన్ని 'మైకీ' అని పేరుతో తామే పెంచుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల నుంచి అది కనిపించక పోవడంతో పోస్టర్లు కూడా వేసి వెతికామని.. ఈ క్రమంలో సొసైటీకి చెందిన ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా దాన్ని కొట్టి చంపేశారని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలా ఎవరూ జంతుహింసకు పాల్పడకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని మంజరి విజ్ఞప్తి చేశారు. 2004లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మంజరి అల్లరి నరేశ్‌తో కలిసి 'సిద్ధూ ఫ్రమ్ శ్రీకాకుళం', 'శుభప్రదం' చిత్రాల్లో నటించారు. అలాగే ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'శక్తి'లో గౌరిగా కనిపించారు.



# కింగ్ నాగార్జున వందో మూవీ

### సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తున్న చిత్ర బృందం



టాలీవుడ్ కింగ్ నాగార్జున నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. 'కింగ్ 100', 'లాటరీ కింగ్' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ మైల్‌స్టోన్ చిత్రానికి రా.కార్తీక దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా దూసుకుపోతోంది. అంతేకాదు.. షుటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్టుగా టాక్. త్వరలోనే చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులపై ఫోకస్ చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్స్ చేస్తోందట. మరోవైపు మ్యూజిక వర్క్ కూడా శరవేగంగా జరుగుతోందట. వచ్చే నెలలోనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసే ఆలోచనలో కూడా ఉన్నారట. అంతేకాదు.. అన్ని అనుకున్నట్టుగా జరిగితే ఈ ల్యాండ్‌మార్క్ మూవీని 2026 దసరా పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కానీ, ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అసలు ఈ సినిమా టైటిల్ ఏంటి నాగార్జున లుక్ ఎలా ఉంటుంది అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. కానీ, కింగ్ ఈసారి అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా సీనియర్ స్టార్ హీరోయిన్ టబు కీలక పాత్ర పోషిస్తుండగా.. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ కలిపి తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసే ఛాన్స్ ఉంది.

# పెద్దిపై బన్నీ ప్రశంసలు

### రామ్ చరణ్ నటన మైండ్ బ్లోయింగ్

### జగపతి బాబు పాత్ర అద్భుతంగా ఉంది





వివాదాల నడుమ బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతున్న 'పెద్ది'పై ప్రశంసలు కూడా పెద్ద ఎత్తున విన్పిస్తున్నాయి. ఇలాంటి టైమ్ లో అల్లు అర్జున్ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్న వేళ, స్వయంగా సినిమా చూసిన బన్నీ తన అభిప్రాయాన్ని పంచుకోవడం ఇండస్ట్రీలో టాక ఆఫ్ ది టౌన్ గా మారింది. 'పెద్ది' చూసిన తర్వాత రామ్ చరణ్ నటన గురించి అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు మెగా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బన్నీ తన పోస్ట్ లో చరణ్ పర్ఫార్మెన్స్ మైండ్ బ్లోయింగ్ గా ఉందని చెప్పారు, అలాగే చెర్రీ పెద్ది పాత్రలో ఇంటెన్స్ గా, సహజంగా, అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ తో ఆకట్టుకున్నాడని, డ్యాన్స్ లో కనిపించిన గ్రేస్ అన్నీ కలిసి ఒక పూర్తి స్థాయి నటుడిగా చరణ్ ను మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. ప్రతి అంశంలోనూ చరణ్ అద్భుతంగా రాణించాడని, ప్రస్తుతం అతడికి వస్తున్న ప్రశంసల్లో ప్రతి ఒక్కటి అతడు సంపాదించుకున్నవేనని చెప్పారు. తన సోదరుడి విజయాన్ని చూసి గర్వంగా ఉందని కూడా అల్లు అర్జున్ పేర్కొన్నారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన నటన బలంగా నిలిచిందని చెప్పారు. అలాగే జాన్వీ కపూర్ తో పాటు మిగతా నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు. తెరపై కనిపించే నటీనటులే కాదు, సినిమా కోసం కష్టపడిన టెక్నీషియన్స్, నిర్మాతలు కూడా ప్రశంసలకు అర్హులని చెప్పారు. అయితే అల్లు అర్జున్ పోస్ట్ లో మరో ముఖ్యమైన అంశం దర్శకుడు బుచ్చిబాబు సానాపై చేసిన ప్రశంసలు. ప్రతి పాత్రను ఎలివేట్ చేస్తూనే రామ్ చరణ్ పాత్రను మరింత ఎత్తుకు తీసుకెళ్లినందుకు దర్శకుడికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఒక హీరోని మాత్రమే కాకుండా మొత్తం కథలోని పాత్రలన్నింటినీ బలంగా నిలబెట్టడం దర్శకుడి విజయమని ఆయన సందేశం ద్వారా స్పష్టమైంది. సాధారణంగా అభిమానుల మధ్య పోలికలు, ఫ్యాన్ వార్స్ ఎక్కువగా కన్పిస్తాయి. కానీ ఒక స్టార్ హీరో మరో స్టార్ హీరో పనితీరును ఇంత ఓపెన్ గా ప్రశంసించడం అరుదుగా జరుగుతుంది. అందుకే అల్లు అర్జున్ పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787